Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి :1 సంచిక : 94 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 ఏప్రిల్ 2023 బుధవారం పేజీలు : 4

## జీఎస్టీపై రాహుల్ కీలక వ్యాఖ్యలు

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రామ్‌దుర్గ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కర్ణాటకలో అధికారంలోకి వస్తే రైతుల ప్రయోజ నాలు కాపాడతామన్నారు. పంటలకు సరైన ధరలు అందేలా చూస్తామ న్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. కేవలం ఒకరిద్దరు పారిశ్రామికవేత్తల పైనే కేంద్రం ఫోకస్ ఉందన్నారు. అదానీ, అంబానీలకు వేలాది ఎకరాలున్నాయని, రుణాలు సులభంగా దొరుకుతా యని, వాళ్ల రుణాలను మాఫీ కూడా చేస్తారని అయితే పేద రైతుల గురించి మాత్రం బీజేపీ సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీపై రాహుల్ విమర్శలు గుప్పించారు. కొందరికి ప్రయోజనం చేకూర్చేందుకే జీఎస్టీ తీసుకొచ్చారని, చాలామందికి జీఎస్టీ అంటే ఏంటో కూడా ఇంకా బోధపడలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే జీఎస్టీని సవరిస్తామని, దేశమంతా ఒకటే టాక్స్ ఉండేలా చూస్తామని, అది కూడా తక్కువ టాక్స్ ఉండేలా చూస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

# కేసీఆర్ స్థాయికి తగ్గ నేత ప్రతిపక్షాల్లో ఉన్నారా!?



## కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపడే నాయకుడు ప్రతిపక్షాల్లో లేరు: మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోయే నాయకుడు ప్రతిపక్షాల్లో లేరని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకరు మెదడు లేని బంటి.. ఇంకొకరు పార్టీలు మారే చంటి.. వాళ్లా ప్రతిపక్షమని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో ప్రతి గ్రామం ఆదర్శంగా మారిందని చెప్పారు. దేశ జనాభాలో 3 శాతం ఉన్న తెలంగాణకు 30 శాతం జాతీయ అవార్డులు వచ్చాయని వెల్లడించారు. ఇదంతా సీఎం కేసీఆర్ ప్రారంభించిన పల్లె ప్రగతితోనే సాధ్యమైందన్నారు. సిరిసిల్లలో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధుల సభలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 60 లక్షల మంది గులాబీ దండుకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. 22 ఏండ్ల క్రితం హైదరాబాద్ జలదృశ్యంలో టీఆర్ఎస్‌గా పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. దేశమంతా తెలంగాణ తరహా అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ రూపాంతరం చెందిందని, మారింది టీఆర్ఎస్ పేరు మాత్రమేనని.. జెండా, గుర్తు, డీఎన్ఏ మారలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని కేసీఆర్ నమ్మారని తెలిపారు. అర్ధబలం, అంగబలం లేకున్నా తెలంగాణ కోసం బయలుదేరారని తెలిపారు. అంతకు ముందు నేతలు తెలంగాణ ఉద్యమం పేరుతో మోసం చేశారనే అభిప్రాయం ప్రజల్లో ఉండేదని చెప్పారు. అయితే ఉద్యమం నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టి చంపాలని చెప్పిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని వెల్లడించారు. 2013లో ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్తున్నా.. తెలంగాణలోనే అడుగుపెడతానని కేసీఆర్ చెప్పారని, అన్నట్టుగానే తెలంగాణ సాధించి తిరిగి వచ్చారని వెల్లడించారు. లక్ష్యాన్ని సాధించిన కేసీఆర్ జన్మధన్యమైందని అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కొనియాడారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేండ్లలోనే ఎట్లున్న తెలంగాణ ఎంత అభివృద్ధి చెందిందో మన కండ్లముందే ఉందన్నారు. తెలంగాణలో ప్రతి గ్రామం ఆదర్శంగా మారిందని చెప్పారు. దేశ జనాభాలో 3 శాతం ఉన్న తెలంగాణకు 30 శాతం జాతీయ అవార్డులు వచ్చాయని వెల్లడించారు. ఇదంతా సీఎం కేసీఆర్ ప్రారంభించిన పల్లె ప్రగతితోనే సాధ్యమైందన్నారు. జిల్లాలోని గంభీరావుపేటకు జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు వచ్చిందని చెప్పారు. గ్రామ సర్పంచ్ కటకం శ్రీధర్‌ను వేదికపైకి పిలిచి అభినందించారు. ఇది గోల్‌మాల్ గుజరాత్ కాదు.. గోల్డెన్ తెలంగాణ అని చెప్పారు. దేశమంతా తెలంగాణ తరహా అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందామని వెల్లడించారు. మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ మూడు సభలు పెడితే లక్షల మంది వచ్చారని తెలిపారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ నినదించారని చెప్పారు. రాష్ట్రంలో గత తొమ్మిదేండ్లలో వ్యవసాయానికి రూ. 4.5 లక్షల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. రైతులకు ఇంత పెద్దమొత్తంలో ఖర్చుచేసిన ప్రభుత్వం ఏదీ లేదని స్పష్టం చేశారు.



ఇవాళ ఊరూరా కార్యకర్తలు గులాబీ జెండాలు ఎగరేస్తుంటే గుండె ఉప్పొంగి పోతున్నదని సంతోషం వ్యక్తంచేశారు. 2018లో ప్రతి కార్యకర్త తానే అభ్యర్థినన్నట్టు పనిచేశారని, సిరిసిల్లలో తనను 89 వేల మెజార్టీతో గెలిపించారని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆదమరిస్తే పచ్చని పందిరిలో పాము జొర్రిందని బీజేపీని ఉద్దేశించి అన్నారు. సిరిసిల్లలో రూ.400 కోట్లతో అపారెల్ పార్కును నిర్మిస్తున్నామన్నారు. ఈ పార్కులో వర్కర్ టూ ఓనర్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో డబుల్ బెడ్ రూం ఇండ్లు, డిగ్రీ కాలేజీ, మెడికల్ కాలేజీ, అద్భుతంగా రహదారులు, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసుకున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు.




## ఆటో నడుపుతూ మంత్రులు హరీశరావు, కేటీఆర్ సందడి!

పార్టీ, ప్రభుత్వ వ్యవహారాల్లో కేటీఆర్, హరీశ్‌రావు.. ఎప్పుడూ తీరిక లేకుండా గడిపే మంత్రులు. ఒక్క మాటలో చెప్పాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ తర్వాత అంతటి జనాదరణ, ప్రాముఖ్యత ఉన్నవారు. ఈ బావా, బావమరిది.. ఇద్దరూ ఆటో నడిపి సందడి చేశారు. సిద్దిపేట జిల్లాలో ఇద్దరూ వేరు వేరు సందర్భాల్లో ఆటో నడిపారు.

# ఒకరు రిజర్వేషన్లు.. మరొకరు టిప్పు-బసవణ్ణ..



## కర్ణాటక రాజకీయం ఉక్కిరిబిక్కిరి

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయాలు రంగులు మారుతున్నాయి. ఎవరికి వారు వ్యూహాత్మకంగా సాగుతు న్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని ముందుకు పోతున్నారు. ఈ క్రమంలో బీజేపీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రాతిపదికగా చేసుకుని రాజకీయాలను ఊపేస్తోంది. ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ను ఇటవలే బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ విషయాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది. అయితే బీజేపీ నాయకులు మాత్రం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడం ఏంటని ప్రశ్నిస్తు న్నారు. అందుకే తాము 4 శాతం రిజర్వేషన్లను లింగాయత్లకు వక్కలిగలకు కేటాయించామని చెబుతు న్నారు. దీంతో అటు కాంగ్రెస్ ఇటు బీజేపీల మధ్య పొలిటికల్ వార్ జోరుగా సాగుతోంది. ఇదిలావుంటే కాంగ్రెస్ రెండు కీలక విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్తోంది. ఒకటి టిప్పు సుల్తాన్ రెండు 12వ శతాబ్దానికి చెందిన బసవణ్ణ. మైసూరును కేంద్రంగా చేసుకుని టిప్పు సుల్తాన్ పాలించారు. ఈయనను కాంగ్రెస్ పార్టీ ఓన్ చేసుకుంది. అదేసమయంలో బీజేపీ టిప్పును విమర్శిస్తోందని. ఆయన జయంతులను నిర్వహించడం లేదని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. తాము అధికారంలోకి వస్తే టిప్పు జయంతులు నిర్వహిస్తామని కూడా పేర్కొంటోంది.

ఇక 12వ శతాబ్దానికిచెందిన బసవణ్ణ ను కూడా కాంగ్రెస్ పార్టీ వాడుకుంటోంది. ప్రజాస్వామ్యానికి సమానత్వానికి బసవణ్ణ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని.. ఆయనను ఆయన సిద్ధాంతాల ను బీజేపీ అణిచి వేస్తోందని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే బసవణ్ణ ఆశయాలను అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. మొత్తంగా బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాలు రోజుకోరకంగా మారుతున్నాయి. ఎన్నికలకు మరో 16 రోజులు మాత్రమే గడువు ఉండడం గమనార్హం.

# వామపక్షాలకు కేసీఆర్ షాక్ తప్పదా ?




## ప్రచారానికే పరిమితం చేస్తారా!?

హైదరాబాద్ : రాబోయే ఎన్నికలకు సంబంధించి వామపక్షాలకు గట్టి షాక్ తగిలేట్లుంది. ఇంతకీ ఆ షాక్ ఏమిటంటే బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు వామపక్షాలు సహకారం అందించాలని కేసీయార్ స్పష్టంచేయబోతున్నారట. బీఆర్ఎస్ వామపక్షాల పొత్తు ఖాయమని ఇప్పటికే బాగా ప్రచారం జరుగుతోంది. సీపీఐ సీపీఎం నేతలు కూడా దీన్ని ధృవీకరిస్తున్నారు. కాకపోతే పొత్తుల్లో భాగంగా బీఆర్ఎస్ తమకు ఇచ్చే సీట్లు ఏమిటి ? ఎన్ని అనే విషయాలపైనే స్పష్టత లేదని ఇంతకాలం చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ వర్గాల తాజా సమాచారం ఏమిటంటే వామపక్షాలకు ఒక్కసీటు కూడా ఇవ్వటానికి కేసీయార్ ఇష్టపడటంలేదట. ఎందుకంటే ఎక్కడ సీటిచ్చినా వామపక్షాలు గెలిచే అవకాశాలు తక్కువని సర్వేల్లో తేలిందట. ఇదే విషయాన్ని పై రెండు పార్టీలకు కేసీయార్ తన సర్వే నివేదికలను పంపారని పార్టీ నేతలు చెబుతున్నారు.

సీట్లివ్వకపోయినా వామపక్షాలు ఎందుకని బీఆర్ఎస్ కు మద్దతిచ్చి గెలుపుకు ప్రయత్నిస్తాయి ? ఎందుకంటే సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఎంఎల్సీ పదవులు ఇస్తానని కేసీయార్ హామీ ఇచ్చారట. ఎంఎల్సీలు బాధ్యతలు తీసుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు సహకరించమని కేసీయార్ పై ఇద్దరు కార్యదర్శులను రిక్వెస్టుచేశారట. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం ఖమ్మం పాలేరుతో పాటు భద్రాచలంలోను సీపీఐ వైరా కొత్తగూడెం ఖమ్మం నియోజకవర్గాలను కోరుతున్నాయి. అయితే ఈ స్థానాలను ఇవ్వటానికి కేసీయార్ ఏమాత్రం ఇష్టపడటంలేదట. సీట్లిచ్చినా గెలుపు కష్టం కాబట్టి హ్యాపీగా ఎంఎల్సీలు తీసుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు రాష్ట్రమంతా ప్రచారం చేయాలని అడిగారని పార్టీవర్గాలు చెప్పాయి. దీనికి వామపక్షాల కార్యదర్శులు అంగీకరించే అవకాశాలే ఎక్కువున్నాయి. ఎందుకంటే కేసీయార్ ఆఫర్ ను కాదంటే ఎంఎల్సీలు కూడా దక్కే అవకాశంలేదు.

కేసీయార్ ఆఫర్ ను కాదని విడిపోయి పోటీచేస్తే ఒక్క నియోజకవర్గంలో కూడా వామపక్షాలు గెలిచే అవకాశాలు లేవు. అందుకనే కాస్త బెట్టుచేసినా తర్వాత కార్యదర్శులిద్దరు దిగిరాక వేరే దారిలేదట. అందుకనే రాబోయే ఎన్నికల్లో వామపక్షాలకు కేసీయార్ షాక్ తప్పదనే ప్రచారం పెరిగిపోతోందట.

# సంపాదకీయం

## నో సంక్షేమం... నో పథకాలూ...?

దేశంలోనూ రాష్ట్రంలోనూ అతి పెద్ద చర్చ ఒకటి ఇపుడు సాగుతోంది. పొరుగున ఉన్న శ్రీలంక దేశం ఆర్థికంగా పతనమవుతునంద నేపథ్యం ఒక వైపు ఉంది. దాంతో మన దేశంలో కూడా ఏం జరుగుతుంది అన్న ఆందోళన ఉత్కంఠ అంతటా ఉంది. దానికి కారణం చాలా చోట్ల ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పడం. రాజకీయమే పరమావధి కావడం. వారూ వీరూ ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా అందరూ తాయిలాలను జనాలకు అలవాటు చేశారు. వీటి వల్లనే తాము గెలిచామని వారు భావిస్తున్నారు. మరింతగా వాటిని పెంచి జనాలకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు అప్పుల పాలు అయినా పట్టడంలేదు. రీసెంట్ గా ఉత్తరాదిన జరిగిన ఎన్నికల్లో పంజాబ్ లో ప్రతీ కుటుంబానికి మూడు వందల యూనిట్ల దాకా విద్యుత్ ఫ్రీ అని ఆప్ లాంటి పార్టీ భారీ హామీని ఇచ్చింది. అలాగే ప్రతీ ఫ్యామిలీకి వేయి రూపాయలను నగదు బదిలీ పథకం కింద ఇచ్చింది. దానికి ఖజానా మీద పడే అదనపు బరువు అక్షరాలా ఇరవై వేల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. ఇక బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలో అయితే ఈ రోజుకు వేయి రూపాయలు ఉన్న వంట గ్యాస్ ని ప్రతీ ఇంటికీ ఫ్రీగా ఇస్తామని చెప్పి మళ్లీ గెలిచింది. మిగిలిన రాష్ట్రాలూ అదే బాటన పయనిస్తున్నాయి. ఏపీలో చూస్తే సంక్షేమ రథాన్ని పరుగులు తీయిస్తోంది. ఇప్పటికి మూడేళ్ళుగా జగన్ ఈ మహా యాగాన్ని అలా నడిపిస్తున్నారు. ఆయన మరో రెండేళ్ల పాటు ఇదే తీరున సంక్షేమాన్ని కొనసాగించాల్సి ఉంది. దాని వల్ల అభివృద్ధి ఆగిపోయింది అన్నది తెలిసిందే. విపక్షాలు సంక్షేమం అన్న మాటను పక్కన పెట్టి ఏపీలో అభివృద్ధి లేదు అని విమర్శలు చేస్తున్నాయి. ఏపీ ఆర్థికంగా పతనం అయిందని మరో శ్రీలంక అని ప్రచారం చేస్తున్నాయి. దానికి కారణం సంక్షేమ పథకాలు విచ్చలవిడిగా అమలు చేయడం అని మాత్రం చెప్పలేకపోతున్నాయి. అవినీతి అంటున్నాయి లూటీ అంటున్నాయి. సరే అవన్నీ రాజకీయ పడిగట్టు మాటలుగా చూసుకున్నా వచ్చే ఎన్నికలో విపక్షాల ఎన్నికల మ్యానిఫెస్టో ఎలా ఉండబోతోంది అన్నది ఒక పెద్ద చర్చ. ముఖ్యంగా టీడీపీ విషయం తీసుకుంటే 2009 ఎన్నికల్లోనే భారీ హామీలు ఇచ్చింది. ఆల్ ఫ్రీ బాబు అని వైఎస్సార్ కూడా నాడు సెటైర్లు వేసేవారు. ఇక లక్ష కోట్ల దాకా రైతులకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని భారీ హామీ ఇవ్వడం వల్లనే టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చింది అన్న మాట కూడా ఉంది. ఇక 2019 ఎన్నికల ముందర సామాజిక పింఛన్లు రెండువేలు చంద్రబాబు చేస్తే దాన్ని మూడు వేలకు పెంచుకుపోతామని జగన్ చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇక వైసీపీ తీసుకువచ్చిన అమ్మ ఒడి వాలంటీర్ల వ్యవస్థ సచివాలయ వ్యవస్థ సహా వివిధ దీవెనల పథకాల మీద విపక్షాల స్టాండ్ ఏంటి అన్నది కూడా ఇపుడు చర్చకు వస్తోంది. ఏపీ నిజంగా ఏ ఒక్క హామీని ఈ రోజుకు తట్టుకునే స్థితిలో లేదు. ఎక్కడ లేని అప్పులు తెచ్చి మరీ నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఏపీలో సంక్షేమ పథకాలను తాము కొనసాగించమని అభివృద్ధి మా అజెండా అని టీడీపీ సహా ఏ పార్టీ అయినా డేరింగ్ గా జనాల్లోకి వచ్చి చెప్పగలదా అన్నదే ఇక్కడ ప్రశ్న. ఒకవేళ అలా చేస్తే కనుక జనాలు ఎలా రియాక్ట్ అవుతారు అన్నది కూడా చూడాలి. రాష్ట్రం సమాజం ఏమైపోతేనేమి మాకు తాయిలాలు దక్కాయి కదా అదే చాలు పదివేలు అనుకునే వ్యవస్థలో ఉన్నారంతా. దాంతో నో సంక్షేమం నో పథకాలు అంటే ఓట్ల పంట పండుతుందా రాజధాని కడతాం మహా నగరాలను నిర్మిస్తామని అభివృద్ధి అజెండా పెట్టుకుని వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుంది. అయితే రాజకీయ పార్టీల వరకూ చూస్తే సంక్షేమ పథకాలను కొనసాగించమని చెప్పే పరిస్థితి 2024 ఎన్నికల్లోనూ కనిపించదని అంటున్నారు. తాము అంతకంటే మెరుగ్గా మరిన్ని కొత్త పథకాలను కూడా తెచ్చి ఇస్తామనే చెబుతాయి. మరి అలాంటి హామీని ఇవ్వకుండా ఏపీ పతనం అవుతోందని చెప్పడం విమర్శలు చేయడం వల్ల ఉపయోగం ఉందా అన్నది కూడా చర్చగానే చూడాలి. ఏపీని పునర్ నిర్మిస్తామని టీడీపీ అంటోంది. దానికి ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అలా చేయాలీ అంటే పందేరాలు అన్నీ బంద్ చేయాలి. అలా కొన్నేళ్ల పాటు చేస్తేనే తప్ప ఏపీ బాగుపడదు ఇది ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. మరి దీన్ని జనాల్లో ఉంచి వారిని ఒప్పించి సానుకూల ఓటుతో అధికారంలోకి వచ్చిన పార్టీదే అసలైన విజయం. మరి అలా చేయాలంటే 2024లో రాజకీయాలు చేసే నాయకత్వానికి బదులుగా రాజనీతితో నడిచే నాయకత్వం రావాలి. అది ప్రస్తుత పరిస్థితుల్లో ఆశించగలమా. చూడాలి మరి.

# పల్లెకు వరం 'అమృత్ సరోవర్'




మహబూబాబాద్ : చెరువులను పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయను అమలు చేసినట్టే కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే తరహాలో మిషన్ అమృత్ సరోవర్ పేరుతో కార్యక్రమాన్ని అమలు చేయబోతోంది. ఈ పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి విడతగా మొత్తం 450 చెరువులను ఎంపిక చేశారు. వీటిలో 50 శాతం చెరువులు మిషన్ కాకతీయ కింద గతంలో మరమ్మతు చేసినవే. కాకపోతే అవన్నీ ఇప్పుడు దెబ్బతిని ఉన్నాయి. మిషన్ కాకతీయ కింద అభివృద్ధి చేయనివి ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా చెరువులు ఉన్నాయి. మిషన్ అమృత్ సరోవర్ కింద ఎంపిక చేయడంలో వీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ కార్యక్రమం కింద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ బాగా దెబ్బతిన్న, తక్షణమే పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నా, వాటి ఆయకట్టు పరిధి ప్రాతిపదికగా ఒక్కో జిల్లా నుంచి 125 నుంచి 150 చెరువులను గుర్తించి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. కేంద్రం ప్రాథమికంగా ఒక్కో జిల్లా నుంచి 75 చెరువులను ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధులతో ఎంపిక చేసిన చెరువుల్లో పూడికతీత, కట్టల బలోపేతం, తూములు, మత్తళ్ల మరమ్మతు లాంటి పనులు చేస్తారు. అవకాశం ఉన్నచోట కొత్త చెరువులు నిర్మిస్తారు. ఇందుకోసం ప్రతీ చెరువుకు రూ.లక్ష నుంచి రూ.10లక్షల దాకా ఖర్చు చేస్తారు.

గ్రామాలకు వరం

చెరువుల పరిస్థితి తిరిగి యథాస్థితికి రావడంతో వాటిని మరమ్మతులు చేయాలని రైతుల నుంచి వినతులు అందుతున్నాయి. ఈలోగా కేంద్రం దేశ వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణకు అమృత్ సరోవర్ పథకాన్ని తీసుకువచ్చింది. అమృత్ సరోవర్ పథకం గ్రామాలకు వరంగా మారనుంది. ఈ పథకం కింద ఎంపిక చేసిన చెరువులను ఈజీఎసలో అభివృద్ధి చేస్తారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా కేంద్రం కోరింది. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గతంలో మిషన్ కాకతీయ కింద చేపట్టని చెరువులతో పాటు ఈ పథకం కింద అభివృద్ధి చేసినప్పటికీ నాసిరకం పనుల వల్ల తిరిగి దెబ్బతిన్న చెరువులను కూడా ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు.

ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి దశలో 450 చెరువులు ఎంపికయ్యాయి. వీటిలో 175 చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఇవన్నీ కొత్త చెరువులే. దీంతో పాటు కొత్త చెరువులను నిర్మిస్తారు. వరదనీరు ఎక్కువగా ప్రవహించే పల్లపు ప్రాంతాల్లో కుంటల నిర్మాణాన్ని కూడా చేపడతారు. వీటిని ఆగస్టు 15వ తేదీ లోగా అభివృద్ధి చేయాలని కేంద్రం ఆదేశించింది. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టు నూటికి నూరు శాతం అమలయ్యేలా ప్రణాళికలను రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే దాదాపు 60 చెరువుల్లో పనులు ప్రారంభమయ్యాయి.

కొత్తవి, పాతవి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1600 చెరువులు ఉండగా ప్రభుత్వం రూ.500 కోట్లు ఖర్చు చేసి నాలుగు విడతల్లో 1100 చెరువులను అభివృద్ధి చేసింది. చాలా చోట్ల పనుల్లో నాణ్యత లేక అవి ఏడాది తిరక్కముందే కట్టలు తెగిపోవడంతో పాటు తూములు, మత్తళ్లు దెబ్బతిన్నాయి. ఎప్పటిలాగే తిరిగి పూడుకు పోయాయి. కొన్ని చెరువులకు మరమ్మతులు చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకున్నారు. మిషన్ కాకతీయ కింద కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయి. చాలా పనులను అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు బినామీ పేర్ల మీద చేపట్టి తూతూ మంత్రంగా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

సాగు, తాగునీరు

భూగర్భ జలాలు పెంచడం ద్వారా తాగు, సాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో చెరువులను అభివృద్ధి చేయడానికి కేంద్రం అమృత్ సరోవర్ స్కీంను తెచ్చింది. ఈ పథకం కింద ప్రతీ చెరువుకు కనిష్ఠంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.10లక్షలు ఖర్చు చేయనున్నారు. అవసరమైతే 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా వినియోగించుకునే వెసులుబాటు కూడా కల్పించారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ కొత్త పథకం కింద సుమారు రూ.35కోట్ల నుంచి రూ.40కోట్లు వెచ్చించే అవకాశాలున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎలాంటి యంత్రాలు వాడకుండా కేవలం ఉపాధి హామీ కూలీల ద్వారానే పనులు చేపడతారు. దీంతో వచ్చే వానాకాలం పంటల సాగు నాటికి వీలైనంతమేర కూలీలకు ఉపాధి పనులు దొరకనున్నాయి. ఈ పథకం ద్వారా పనులు జరిగే ప్రతీ చెరువు కింద లక్ష పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పనుల్లో భాగంగా చెరువు అడుగు భాగంలో 10వేల ఘనపుటడుగుల మేర నీటిని నిల్వ ఉండేలా కొలతలు ఇచ్చి ఆ మేరకు ఒండ్రు మట్టిని తీయనున్నారు. ఒండ్రు మట్టిని పొలాలకు తరలించుకునేందుకు, చెరువు కట్ట పటిష్టానికి ఉపయోగించనున్నారు. చెరువుల్లోని ఒండ్రు మట్టిని ఎటు తరలించాలి, దేనికి ఉపయోగించాలనే విషయంలో తుది నిర్ణయం గ్రామపంచాయతీలదే. కట్టపై పెరిగిన కంపచెట్లను తొలగిస్తారు. పనులు పూర్తయితే వచ్చే వానాకాలం చెరువులు జలకళను సంతరించుకోనున్నాయి. గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ పనులు అమలవుతాయి. ఎంపిక చేసిన చెరువుల్లో పనులు పూర్తి చేసి కట్ట పటిష్టం చేశాక చెరువు కట్టపై స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# గల్లీకో 'బెల్ట్'!

మొయినాబాద్ :గ్రామాల్లో బెల్టుషాపుల జోరు కొనసాగుతోంది. గల్లీగల్లీలో మందు దొరుకుతుంది. అర్ధరాత్రి వరకు కూడా దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఎమ్మార్పీ కన్నా రేటు పెంచి మద్యంపై అదనపు లాభాలు ఆర్జిస్తున్నారు. దీంతో మద్యం బాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధిపాలవుతున్నాయి. పట్టపగలే బెల్ట్ షాపులను నడుపుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని గ్రామాల్లో బెల్టు షాపుల దందా జోరుగా కొనసాగుతుంది. మద్యం అక్రమ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నా ఎక్సైజ్ శాఖ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కిరాణ దుకాణాల మాటున బెల్టుషాపులు ఏర్పాటు చేసి రాత్రి పగలు అనే తేడా లేకుండా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఊళ్లల్లో ఎక్కడపడితే అక్కడ మద్యం దొరుకుతుండటంతో యువత పెడదారి పడుతున్నారు. మద్యానికి బానిసై కుటుంబాలను పట్టించుకోకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. నగర శివారు మొయినాబాద్ మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా వీధివీధినా బెల్టు దుకాణాలు దర్శనమిస్తున్నాయి. బాహాటంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా అబ్కారీ పోలీసులు వారి జోలికి వెళ్లడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మద్యాన్ని విక్రయిస్తున్నా.. వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రతి గ్రామంలో కనీసం రెండు నుంచి 10 వరకు బెల్టుషాపులు నడుస్తున్నాయి. విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలపై మహిళలు ఫిర్యాదు చేసినా స్పందన ఉండటం లేదు. ఎన్నో కుటుంబాల్లో మద్యం చిచ్చు పెడుతున్నా ఆయా గ్రామ ప్రజాప్రతినిధుల అండదండలతో బెల్టు దుకాణాలు జోరుగా నడుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల బాటపండగలు, ఎన్నికలు ఇతర సందర్భాల్లో ప్రభుత్వాలు ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను మూసివేస్తుంటారు. ఇలాంటి సమయంలో మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో నడుస్తున్న బెల్టుదుకాణాలకు మందుబాబులు క్యూ కడుతుంటారు. మండలం నుంచే కాకుండా నగరంలోని పలు ప్రాంతాల నుంచి మద్యం కోసం ఈ గ్రామాలకు వస్తుండడం గమనార్హం. ఇదే అదునుగా భావించే బెల్టు షాపుల యాజమానులు ప్రభుత్వ ధరకు రెండింతలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అబ్కారీ శాఖ అధికారులతోపాటు, స్థానిక పోలీసులు ఆ గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. దూర ప్రాంతాల నుంచి మద్యం కోసం వచ్చి కొందరు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. ఇటీవల బాకారంలో మద్యం కోసం వస్తున్న ఎన్కేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని కారు ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మొయినాబాద్ పోలీసులతోపాటు అబ్కారీ పోలీసులు నిద్రమత్తు వీడి బెల్టుదుకాణాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎప్పుడువస్తారో.. ఎప్పుడు వెళ్తారో?చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో అబ్కారీశాఖ పోలీసస్టేషన్ ఉంది. ఇక్కడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితోపాటు ఎస్సై ఇతర సిబ్బంది ఉన్నారు. అయితే వీరు ఎప్పుడు కార్యాలయానికి వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో బెల్టుదుకాణాలపై ఎస్ఓటీ పోలీసులు వచ్చి దాడులు చేసి మద్యం పట్టుకుంటున్నప్పటికీ స్థానికంగా ఉన్న అబ్కారీపోలీసులు ఆ పని ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అబ్కారీ అధికారులు నిద్రమత్తు వీడి గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుదుకాణాలను మూసివేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ గ్రామాల్లో బెల్టు దుకాణాలు అధికంమొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు దుకాణాల వ్యవహారం జోరుగా సాగుతున్నా పట్టించుకోవాల్సిన అబ్కారీ పోలీసులు మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని బాకారం జాగీర్, చిన్నమంగళారం, సురంగల్, కనకమామిడి, మేడిపల్లి, చిలుకూరు, అప్పోజిగూడ, ఎన్కేపల్లి, పెద్దమంగళారం, చందానగర్, రెడ్డిపల్లి, మూర్తుగూడ, అమ్డాపూర్, కాశీంబౌళి, సురంగల్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బెల్టుదుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఏ కారణం చేతనైనా మద్యం దుకాణాలు మూసివేసే ముందు రోజే ఈ గ్రామాల్లోకి అక్రమంగా మద్యాన్ని దుకాణాదారులే తరలిస్తుండడం కొసమెరుపు.

ఎక్సైజ్ శాఖకు బెల్ట్‌షాపులు కనిపించడం లేదా?మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో ఇటీవల ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి రూ.20వేల మద్యం సీసాలను పట్టుకున్నారు. అంతేకాకుండా బాకారం జాగీర్ గ్రామంలో సైతం ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ పోలీసులు వచ్చి దాడులు నిర్వహిస్తున్నా.. స్థానిక పోలీసులకు మాత్రం ఈ బెల్టుదుకాణాల వ్యవహారం కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అధికారులు నిద్రమత్తు వీడాలి.. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

# ట్రయల్ రన్‌కు సిద్ధం!

నిజామాబాద్ : మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు ఇచ్చేందుకు ముంపు గ్రామాల రైతులు ఒప్పుకోకపోయినా.. ప్రస్తుతం ఉన్న చెరువు ద్వారానే సాగుకు నీటిని అందించేందుకు నిర్మాణాలను పూర్తిచేస్తున్నారు. కాళేశ్వరం 20, 21వ ప్యాకేజీల ద్వారా రెండు లక్షల ఎకరాలకు నీటిని అందించేందుకు పైప్‌లైన్‌ల నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌజ్‌ల నిర్మాణాలు ఆలస్యమైనా.. ఈ వారంలోనే ట్రయల్‌రన్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వచ్చే వానాకాలం సీజన్‌లో ఈ రెండు ప్యాకేజీ ల ద్వారా జిల్లాలోని నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాలకు సా గునీరు అందించేందుకు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. అయితే, కాల్వల కు బదులు పైప్‌లైన్‌ల ద్వారా నీటిని అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా.. రిజర్వాయర్‌కు నోటిఫికేషన్ వచ్చిన తర్వాతనే భూసేకరణ చేపట్టి నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టాలిమంచిప్ప రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు భూములు ఇచ్చేందుకు ముం దుకు రావడం లేదు. పాత డిజైన్ ప్రకారమే నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులతో జరిగిన సమావేశంలో తమ విజ్ఞప్తులను ఇస్తూనే.. మం చిప్ప వద్ద పనులను అడ్డుకుంటున్నారు. రిజర్వాయర్ ఎత్తు పెంచకుండా.. మొ దట నిర్ణయించిన విధంగానే నిర్మాణం చేయాలని కోరుతున్నారు. ప్రాణహిత చేవెళ్ల పథకం కింద 20, 21, 22వ ప్యాకేజీ పనులను చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రం లో వైఎస్ హయాంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నుంచి ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించేందుకు నిర్ణయించారు. ఈ మూడు ప్యాకేజీల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు డిజైన్ చేశారు. అయితే, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్యాకేజీలను కాళేశ్వరం పథకంలో కలిపారు. ఈ ప్యాకేజీల కింద కాల్వలకు బదులు పైప్‌లైన్‌ల ద్వారా సాగునీటిని అందిం చేందుకు రీడిజైన్ చేశారు. దీనిలో భాగంగా మంచిప్ప రిజర్వాయర్ ఎత్తు పెంచేందుకు నిర్ణయించారు. గతంలో ఇచ్చిన 1.5 టీఎంసీలకు బదులు 3.5 టీఎంసీల నీళ్లను నిల్వ చేసేందుకు రీడిజైన్ చేశారు. కేం ద్ర పర్యావరణ, అటవీశాఖల అనుమతులు తీసుకున్నారు. ఈ మంచిప్ప ఎత్తు పెంచి తే 2,400 ఎకరాల వరకు భూములు మునిగిపోతున్నాయి. మంచిప్ప గ్రా మంతో పాటు తొమ్మిది తండాలు, గ్రామ పంచాయతీల పరిధిలోని భూములు ముంపునకు గురవుతున్నాయి. అంతేకాకుండా.. అటవీ భూమి వెయ్యి ఎకరాలకుపైగా పోతుండగా, రైతుల భూమి 1400 ఎకరాల వరకు ముంపున కు గురవుతోంది. వీటితో పాటు తండాలు నీట మునగనున్నాయి. ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్న రైతులు పాత డిజైన్ ప్రకారమే నిర్మా ణం చేయాలని కొత్త డిజైన్‌ను ఆమో దించవద్దని కోరుతున్నారు. పలుమార్లు ధర్నాలు నిర్వహించడంతో పాటు అధికారులకు విజ్ఞప్తులను చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఇంకా పూర్తిస్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రిజర్వాయర్ ఎత్తు పెంచి నిర్మాణం చేసేందుకు భూసేకరణ కోసం ఇంకా నోటిఫికేషన్ విడుదల చేయలేదు. పనులు ఆలస్యమైనా.. వేగంగా పనులుమంచిప్ప రిజర్వాయర్ నిర్మాణ పనులు ఆలస్యమైనా.. ప్రస్తుతం ఉన్న కొండెం చెరువు ద్వారానే జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 20, 21వ ప్యాకేజీల ద్వారా సాగునీరు అందించేందుకు నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు. కాల్వలకు బదులు పైప్‌లైన్‌ల నిర్మాణం చేస్తున్న అధికారులు.. ఈ వానాకాలంలో కనీసం 50 వేల ఎక రాలకు సాగునీరు అందించేందుకు సిద్ధమవుతున్నారు. సారంగపూర్, మెంట్రాజ్ పల్లి పంప్‌హౌజ్‌ల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సారంగపూర్ పంప్‌హౌజ్ నిర్మాణ పనులు పూర్తికాగా, ఈ వారం చివరిలోపే ట్రయల్‌రన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ట్రయల్‌రన్ కోసం అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారి, జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలో ట్రయల్‌రన్ నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను నవీపేట మండలం బినోల నుంచి సారంగపూర్ వరకు టన్నెల్ ద్వారా మళ్లిస్తారు. సారంగపూర్ సర్జ్‌పూల్‌లో ఏర్పాటు చేసిన పంప్‌ల ద్వారా నిజాంసాగర్ కాల్వల్లో నీటిని ఎత్తిపోస్తారు. ఈ నీటిని డిచ్‌పల్లి మీదుగా మెం ట్రాజ్‌పల్లి వరకు నిజాంకాల్వల ద్వారా తరలిస్తారు. మెంట్రాజ్‌పల్లిలో ఏర్పాటు చేసిన పంప్‌ల ద్వారా నీటిని పైప్‌లైన్‌లకు మళ్లిస్తారు. ఈ రెండు పంప్‌హౌజ్‌ల లో ట్రయల్‌రన్ డ్రై, వెట్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సా రంగపూర్ వద్ద మూడు పంప్‌హౌజ్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 2,100 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ కాల్వలో ఎత్తిపోయనున్నారు. మెంట్రాజ్‌పల్లి వద్ద 10 పంపులను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా నీటిని పైప్‌లైన్‌లకు మళ్లించి ఆయకట్టుకు అందిస్తారు. సారంగపూర్ పంప్‌హౌజ్ నుంచి నిజాంసాగర్ కాల్వ ద్వారా మాసాని చెరువుకు కొంతనీరును తరలిస్తారు. మాసాని చెరువు నుంచి మంచిప్ప వద్ద ఉన్న కొండెం చెరువుకు నీటిని మళ్లిస్తారు. అక్కడ నిర్మాణం అవుతున్న గడ్కోల్ పంపు ద్వారా సిరికొండ మండల వరకు నీటిని తరలిస్తారు. మంచిప్ప వద్ద నిర్మాణం చేస్తున్న గడ్కోల్ పంప్‌హౌజ్ పనులు మరో ఆరు నెలల తర్వాత పూర్తికానున్నాయి. ఈ పంప్‌హౌజ్ ద్వారా మోపాల్ నుంచి సిరికొండ మండలం గడ్కోల్ వరకు 85వేల ఎకరాల వరకు సాగునీటిని అందించనున్నారు. మొదట నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌజ్‌ల ద్వారా ఈ వానాకాలంలో ఆయకట్టుకు నీటిని అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. కొండెం చెరువు నుంచి నీటి తరలింపు మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం పూర్తికాకున్నా.. ప్రస్తుతం ఉన్న కొండెం చెరువులో నుంచి నీటిని తరలిస్తూ.. జిల్లాలోని సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి, గడ్కోల్ పంప్‌హౌజ్‌ల ద్వారా సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నా రు. రిజర్వాయర్ నిర్మాణం ఆలస్యమైనా జిల్లాలో సాగునీటి సరఫరాకు ఇబ్బం దులు లేకపోవడంతో ఈ రెండు ప్యాకేజీల ద్వారా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే కామారెడ్డి జిల్లా పరిధిలోని 22వ ప్యాకేజీకి సాగునీటిని మళ్లించనున్నారు. అప్పటి వరకు ఆ వైపు పనులు పూర్తి అయితే.. ప్రస్తుతం ఉన్న కొండెం చెరువు ద్వారానే కొంత ఆయకట్టుకు కామారెడ్డి జిల్లా పరిధిలో కూడా అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. భూసేకరణకు ఆలస్యమైనా ఆయకట్టుకు ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం ఉన్న కొండెం చెరువు ద్వారానే నీటిని అందించేందుకు సాగు నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.ఆయకట్టుకు వానాకాలం నుంచి సాగునీరు : మధుసూధన్‌రావు, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్, నిజామాబాద్‌జిల్లాలో 20, 21వ ప్యాకేజీల కింద వచ్చే వానాకాలం నుంచి సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నాం. మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం ఆలస్యమైనా.. ప్రస్తుతం ఉన్న నిర్మాణాల ద్వారానే సాగునీరు అందిస్తాం. సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి పంపుల ద్వారా జిల్లాలో ఆయకట్టుకు మొదట నీటిని విడుదల చేస్తాం. గడ్కోల్ పంపు నిర్మాణం పూర్తయిన తర్వాత ఆ పరిధిలోని రైతులకు నీటిని అందిస్తాం. ప్రస్తుతం పైప్‌లైన్‌ల నిర్మాణం కొనసాగుతోంది. ఈ వారం చివరలోనే సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి పైప్‌లైన్‌ల ట్రయల్‌రన్ చేస్తాం.

# మహిళా సమ్మాన్.. సెల్ఫీ దిగుదాం

ఖమ్మం : తపాలా కార్యాలయాల్లో ప్రధాన మంత్రికి ధన్యవాదాలు తెలిపే సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళా సమ్మాన్ పథకంలో చేరిన మహిళ ఫొటో తీసుకోవాలి. బలవంతం ఏమీ లేదు. ఇష్టపడేవారికి మాత్రమే. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మహిళా సమ్మాన్ పథకంపై అవగాహన కోసం ఇలాంటి ఏర్పాటు చేశారు. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా సమ్మాన్ ఖాతా తెరిచిన మహిళలకు ఇక్కడి స్వీయ చిత్ర పాయింట్‌ను చూపిస్తున్నారు. అందులో ఆసక్తి ఉన్న వారు ఫొటో దిగేందుకు సమ్మతిస్తున్నారు.

మహిళా సమ్మాన్ మహిళలకు మాత్రమే. తన పేరుపై, ఆడ పిల్లలు, మైనర్ బాలికలైతే సంరక్షకురాలి పేరుతో ఖాతా తెరవాల్సి ఉంటుంది.




రెండేళ్ల గడువు కాలం, వెయ్యి రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే వెసులుబాటు, రెండు లక్షలతో ఖాతా తెరిచిన మహిళకు రెండేళ్ల గడువు తర్వాత రూ.2,32,044 అందజేస్తారు. ఖాతాలో చేరిన మహిళ ఓ ఏడాది తర్వాత కట్టిన మొత్తంలో 40 శాతం తీసుకోవచ్చు. వద్దనుకుంటే ఆరు నెలల తర్వాత ఉపసంహరించుకునే సదుపాయం ఉంది.

తపాలా కార్యాలయంలో లభించే దరఖాస్తు పూర్తి చేసి, ఆధార్, పాన్ కార్డులు సమర్పించి ఉమ్మడి జిల్లాలోని ఏ తపాలా కార్యాలయంలోనైనా ఖాతా తెరిచే సదుపాయం అందుబాటులో ఉంది. కొద్ది రోజుల్లోనే 300 మంది మహిళలు ఈ పథకంలో చేరారు.

# కొత్త మార్గంలో కార్గో!

వరంగల్ : కొవిడ్ నుంచి ఆర్టీసీ తన నష్టాలను పూడ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే 2020 జూన్‌లో కార్గో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 డిపోల పరిధిలో 11 చోట్ల ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.1.50లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పైగా ప్రతిరోజూ సమకూరుతోంది. డిపో పరిధిలో ఒక మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ అధికారితో పాటు ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందిని ఈ సేవల కోసం ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల కార్గోను లాజిస్టిక్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేటు ఏజెంట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

**ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, ములుగు ప్రాంతాల్లోని కార్గోలను కమీషన్ బేసిక్‌పై ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అత్యధిక ఆదాయం వచ్చే హనుమకొండ, వరంగల్ కేంద్రాలను ఆర్టీసీ నిర్వహిస్తోంది. త్వరలోనే వీటిని కూడా ప్రైవేటు వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఏజెంట్లకు అప్పగిస్తే ఇప్పుడున్న ఆదాయానికంటే మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ



లెక్కలేస్తోంది. ఏజెంట్లకు అప్పగించడం వలన సిబ్బందిని వారే నియమించుకుంటారు. వీరిపై ఆర్టీసీకి చెందిన మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ చేస్తారు.

**అధిక ఆదాయం వస్తుందనీ..**

లాజిస్టిక్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులకు 12 శాతం కమీషన్‌పై అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి తోడు కేంద్రం నిర్వహణకు అద్దె చెల్లించడంతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చే ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో బస్సులు సరిగా నడవలేని సమయంలో ఆర్టీసీ సిబ్బందిని కార్గో సేవలకు వినియోగించామని, ప్రస్తుతం వందశాతం బస్సులు నడుస్తుండడంతో.. తిరిగి వారి విధులనే కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే కేంద్రాలను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..- ఎం.వేణుగోపాల్, ఏటీఎం, లాజిస్టిక్ వరంగల్ రీజియన్ అధికారి**

ఇప్పటికే హనుమకొండ, వరంగల్ మినహా అన్నికేంద్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రైవేటుకు అప్పగించాం. కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపకపోవడంతో.. సిబ్బందిని కార్గో సేవలకు ఉపయోగించాం. ప్రస్తుతం బస్సులు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. లాజిస్టిక్ కేంద్రాలు ఇతరులకు అప్పగించడం వలన కార్యాలయాలకు అద్దెతో పాటు ఇతర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటుకు అప్పగించినా పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తారు.

# ఉద్యోగ భద్రతకు సహకారం




ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉత్తర్వు- 44 ప్రకారం దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగుల కల ఎట్టకేలకు నెరవేరింది. సహకార వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వీరికి ఉద్యోగ భద్రత లేదు. సంఘాల అధ్యక్షుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, వేతనాలను స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు సహకార సంఘాల అధ్యక్షులకు సైతం గౌరవ వేతనాన్ని సర్కారు పెంచింది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 సహకార సంఘాలు ఉన్నాయి.

**317 మంది ఉద్యోగులకు లబ్ధి**

సర్కారు తాజా నిర్ణయం వల్ల సహకార సంఘాల్లో కార్యదర్శి, స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్ క్యాడర్లలో పనిచేస్తున్న 317 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అర్హుల జాబితాను డీఎల్ఈసీ (డీసీసీబీ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ) నుంచి ఎస్ఎల్ఈసీ (స్టేట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)కి అధికారులు పంపించారు. ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులకు శుక్రవారం నుంచి ఉత్తర్వులు జారీ కానున్నాయి. బేసిక్‌పేపై 103 శాతం డీఏ, పదకొండు శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఇది 2014 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. అంతకుముందున్న సర్వీసు పీరియడ్‌కు.. జీవో నంబరు-115 ప్రకారం 2009 మార్చి 31కి ముందు ప్రతి 18 నెలలకోసారి ఇంక్రిమెంట్ ఇస్తూ 2009 ఏప్రిల్ 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. 2009 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 వరకు ఏటా ఒక ఇంక్రిమెంట్ చొప్పున ఇస్తూ ఉద్యోగుల బేసిక్ పేను ఫిక్స్ చేశారు. 2021-22 ఆడిట్ రిపోర్టు ఆధారంగా పెరిగిన వేతనం చెల్లిస్తారు.

**అధ్యక్షులకు పెరిగిన గౌరవం**

పీఏసీఎస్‌ల అధ్యక్షులకు ఇప్పటివరకు గౌరవ వేతనం నెలకు రూ.1,250 అందింది. సంఘాల టర్నోవర్ ఆధారంగా గౌరవ వేతనమివ్వాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. ఖమ్మం టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు కర్షక సేవాసమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఒక్కరే అత్యధికంగా గౌరవ వేతనం రూ.15వేలు పొందనున్నారు. ఈ సంఘం టర్నోవర్ రూ.41కోట్లు.

ఖమ్మం జిల్లాలో 221 మంది ఉద్యోగులకు 205 మంది సర్వీసును క్రమబద్ధీకరించి వేతనాలను స్థిరీకరించామని డీసీఓ విజయకుమారి తెలిపారు. సర్వీసులో అంతరాయం, ఇతర కారణాల వల్ల మరో 16 మందికి వర్తింపజేయలేదన్నారు.

# ప్రగతి పత్రాలు.. ఆన్‌లైన్‌లో



ఖమ్మం : పాఠశాల విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల 24తో ముగియనుంది. విద్యార్థుల ప్రశ్నపత్రాల మూల్యాంకన వివరాలు తెలిపే ప్రోగ్రెస్ కార్డుల (ప్రగతి పత్రాలు) పంపిణీ కరోనా నాటినుంచి నిలిచిపోయింది. ఈసారి ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈపాటికే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక (ఎస్ఏ-1) పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఎస్ఏ-2 ఫలితాలనూ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేస్తున్నారు.

**గతంలో ఇలా..**

2019-20 విద్యా సంవత్సరం వరకు ప్రతి విద్యార్థికి సంచిత సమగ్ర నివేదికలు అందించేవారు. అందులో విద్యార్థి వ్యక్తిగత వివరాలు, ఫొటో, మార్కులు, గ్రేడ్లు, తరగతి వారీగా ఆరోగ్య సమాచారం, వివరణాత్మక సూచనలు నమోదు చేసి దానిపై తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేవారు. ప్రభుత్వం సరఫరా చేసే ఈ నివేదిక 25 పేజీలతో ఉండేవి. ఇందులో భాగమైన ప్రోగ్రెస్ కార్డులోనే విద్యార్థుల మార్కులు ఉండేవి. పాఠశాల మారితే విద్యార్థి తన వెంట ఈ కార్డు తీసుకెళ్లి కొత్తగా చేరిన పాఠశాలలో అప్పగించేవారు. నాలుగేళ్లుగా సమగ్ర శిక్షాభియాన్ నిలిపివేయడంతో ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి ప్రైవేటుగా సమగ్ర నివేదిక తయారు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొరగా వచ్చే నిధులు నిర్వహణకే సరిపోవడం లేదని, వీటి కొనుగోలు ఆర్థిక భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాత విధానానికి స్వస్తి పలికి విద్యార్థులకు ఇకనుంచి ఒకటే ఆన్‌లైన్ ప్రగతి పత్రాన్ని అందించనున్నారు. "ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించే ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 23లోగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. విద్యార్థుల వారీగా ప్రగతి పత్రాలను సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకుని సిద్ధంగా ఉంచాలి. ఈ నెల 24న తల్లిదండ్రులతో చివరి సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను అందించాలి."సోమశేఖరశర్మ, డీఈవో, భద్రాద్రి

# కరవు సీమలో పాల వెల్లువ

జనగామ : జనగామలోని పాల శీతలీకరణ కేంద్రం (విజయ డెయిరీ) రికార్డు స్థాయిలో పాలను సేకరిస్తోంది. పాల సేకరణలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. పాడి రైతులకు ప్రోత్సాహమందిస్తూ ప్రగతిపథంలో పయనిస్తోంది.

**రోజూ 25 వేల లీటర్ల సేకరణ**

జనగామ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోకి జిల్లాలోని 12 మండలాలతో పాటు యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట, సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం కూడా వస్తాయి. వీటిలో మొత్తం 250 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. 4వేల మందికి పాడి రైతులు పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో వివిధ మండలాల నుంచి సేకరించిన పాలను జనగామకు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని విజయ డెయిరీకి పంపించేవారు. ఈ ఏడాది నుంచి జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట, సింగరాజుపల్లి, లింగాలఘనపురం, చీటూరు, కామారెడ్డిగూడెంలో మినీ బల్క్ మిల్క్ సెంటర్ యూనిట్(బీఎంసీయూ)లను నెలకొల్పి సేకరించిన పాలను అక్కడే చిల్లింగ్ చేసి నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

**పాడి రైతులకు ప్రోత్సాహకాలు**

విజయ డెయిరీ కేంద్రాలకు పాలను విక్రయించే రైతులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. పశువులకు వాడే ఫోడర్ సీడ్, మినరల్ మిక్చర్, క్యాల్షియం, విజయ క్యాటిల్ ఫీడ్, డీవార్మింగ్ మందులు, టీకాలను రాయితీపై అందిస్తున్నారు. రైతుల కుటుంబాల్లో వివాహాలు జరిగితే రూ.5 వేలు కానుక పేరుతో అందిస్తున్నారు. మరణించిన రైతుల అంత్యక్రియలకు రూ.5 వేల సాయమందిస్తున్నారు. వారి పిల్లలు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే రూ.1000 ప్రోత్సాహక బహుమతిని విజయ డెయిరీ అందిస్తోంది. ముద్ర రుణాలు అందజేస్తున్నారు. రైతులు పాడి పశువులను కొనుగోలు చేసేందుకు ప్రధానమంత్రి రుణ పథకం, ముద్ర పథకాల్లో రూ.10 లక్షల చొప్పున ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకానికి ఇప్పటికే జనగామ జిల్లాలో 600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు**

గతేడాది ప్రతి మండలంలో 9 మంది చొప్పున పాడి రైతులతో కమిటీలను ఏర్పాటు చేశారు. కొత్తగా జిల్లాలో ఆరు పాల సేకరణ కేంద్రాలను సొసైటీలకు అప్పగించారు. జనగామ పాలశీతలీకరణ కేంద్రం ద్వారా సేకరిస్తున్న పాలు టెట్రా పాలకు కూడా అర్హత



పొందాయి. ఇప్పుడు జనగామ, ఇతర కేంద్రాల ద్వారా నేరుగా హైదరాబాద్‌కు పాలను రవాణా చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా 'పాలమిత్ర' యాప్‌ను రూపొందించి జనగామ, బచ్చన్నపేట కేంద్రాల్లోని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రైతులు కేంద్రాలకు పోస్తున్న పాలు, ధర, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. రానున్న రోజుల్లో జనగామలోని పాలశీతలీకరణ కేంద్రంలోనే పాల పొట్లాలు తయారు చేయాలని, మార్కెటింగ్ వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించి యంత్ర పరికరాలు తీసుకురానున్నారు.

**ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.. - జి.ధన్‌రాజ్, ఉపసంచాలకులు, జనగామ విజయ డెయిరీ**

రానున్న రోజుల్లో రోజుకు 60 వేల లీటర్ల పాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. త్వరలో జనగామ కేంద్రంలో రూ.4 కోట్లతో పాల పొట్లాల తయారీని ప్రారంభించాలనుకుంటున్నాం. గ్రామాల్లో పశుగణన చేపట్టి పాల దిగుబడి పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం.

**రైతుల సమస్యల పరిష్కారానికి కృషి- జనగాం సోమిరెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు**

జనగామ పాలశీతలీకరణ కేంద్రంలో రికార్డు స్థాయిలో పాల సేకరణ చేసేందుకు చర్యలు చేపడతాం. రైతులకు రాయితీపై దాణా అందజేస్తున్నాం. గ్రామాల్లోని పాల కేంద్రాలను తరచూ సందర్శించి రైతుల కష్ట, నష్టాలను తెలుసుకుంటున్నాం. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

# మూతపడిన యంత్రాలు.. పని లేక రెండేళ్లు!

మహబూబాబాద్ : పసుపు ధర దిన దినం పడిపోవడంతో ఉపాధి నిలిచిపోయింది. పసుపు కొమ్ములకు పాలిష్ చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారుల ఆశలు నిరాశలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న యంత్రాలు పని లేక తుప్పు పట్టిపోతుండటంతో తల్లడిల్లుతున్నారు. యంత్రాల కొనుగోలు చేసిన అప్పులు చెల్లించడానికి.. కరెంట్ బిల్లులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భారాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ పనిపై ఆధారపడిన 250 మంది కూలీలలో 200 మందికి పనుల్లేక వేరే పనులు దొరకక అవస్థలు పడుతున్నారు. పసుపు ధర తగ్గడంతో యంత్రాలు మూతపడ్డాయి. వ్యాపారులు, కూలీలు పడుతున్న ఇబ్బందులపై మానవీయ కథనం..

మొదట్లో కేసముద్రం విపణిలో పసుపు కొనుగోలు చేసిన వ్యాపారులు నిజామాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ పాలిషింగ్ చేయించి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో కేసముద్రం విపణిలో విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు నిజామాబాద్‌కు వెళ్లకుండా స్వయంగా ఇక్కడనే పసుపు పాలిషింగ్(డోలా) యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు, బంగ్లాదేశ్, చైనా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడించారు. రెండు, మూడు యంత్రాలతో కొనసాగిన పాలిషింగ్ 20 యంత్రాలకు చేరింది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గడం. వరంగల్, కేసముద్రం మార్కెట్లకు ఏడాదికి సుమారు 8 లక్షల బస్తాలు విక్రయానికి వస్తే ధర లేక లక్ష బస్తాలు కూడా రావడం లేదు.

**దుబ్బ పడుతున్న యంత్రాలు..**



ఒక్కో వ్యాపారి యంత్రానికి రూ.10 లక్షలు, షెడ్, గోదాం నిర్మాణానికి మరో రూ.20 నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తంగా రూ.30 నుంచి రూ.35 లక్షలు వెచ్చించి 20 పాలిషింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు పనులు లేక 15 యంత్రాలు దుబ్బపడుతున్నాయి. కొన్ని తుప్పుపట్టాయి. కరెంట్ బిల్లులు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. కొందరు ఆ బిల్లులను కూడా చెల్లించడానికి డబ్బులు లేక 63 నుంచి 75 హెచ్‌పీ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్న నియంత్రికలను తీసుకెళ్లాలని, కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

**నాణ్యత లేమి..**

ఒకప్పుడు కర్కుమిన్, అయిల్ శాతం వ్యాపారులు నచ్చే విధంగా ఉన్నటువంటి పసుపులో ఇప్పుడు ఆ నాణ్యత ప్రమాణాలు తగ్గాయి. ఇందుకు ముఖ్య కారణం గత 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు పసుపు సాగును ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండడంతో గుర్తింపు లభించింది. అలాంటిది రైతులు ఏటా విత్తన మార్పిడి చేయకుండా పండించిన పంటనే తిరిగి విత్తనంగా వినియోగించడం వల్ల చీడపీడల బెడద పెరిగి నాణ్యత తగ్గింది.

దుబ్బపట్టిన పాలిషింగ్(డోలా) యంత్రాన్ని చూపుతున్న ఈ వ్యాపారి కేసముద్రానికి చెందిన అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి. 25 ఏళ్ల నుంచి మార్కెట్లో పసుపు ఖరీదు చేస్తున్నారు. పాలిషింగ్ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. అంతకు ముందు కొనుగోలు చేసిన పసుపు బస్తాలు గోదాంలోనే నిల్వ ఉన్నట్లు ఆయన చెబుతున్నారు. నాణ్యమైన పంట వస్తేనే అర్డర్లు వచ్చి యంత్రాలకు పని కలుగుతుందని వాపోతున్నారు.

**ఇలాంటి పరిస్థితులు వస్తాయనుకోలేదు**

**చిదిరాల వసంతరావు, కేసముద్రం**

కేసముద్రం మార్కెట్ పరిధిలో గత 30 ఏళ్లుగా పసుపు ఖరీదు చేస్తున్నాను. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేశాం. పసుపు కొమ్ములకు మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం నాణ్యత లేక డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ఖరీదు చేయడానికి ఇష్టపడడం లేదు. మార్కెట్‌కు పసుపు రాబడులు పూర్తిగా పడిపోయాయి. ఫలితంగా రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న డోలా యంత్రాలను మూసేశాం. దీనిపై ఆధారపడిన కూలీలకు పనులు లేవు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు.

# గోదావరి.. నువ్వొస్తేనే సిరి

వరంగల్ : పాకాల సరస్సు అన్నదాతలకు అన్నపూర్ణ వంటిది, ఒకసారి నిండితే వానాకాలంలో 30వేల ఎకరాలు, యాసంగిలో 10వేల ఎకరాలు సాగవుతుంది. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన పాకాలకు గోదావరి జలాలను తెచ్చేందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేసి రెండేళ్ల కిందట యాసంగికి మూడు అడుగుల నీటిని అందించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం యాసంగిలో సరస్సు కింద 23 వేల ఎకరాల్లో యాసంగి సాగైంది. ప్రస్తుతం సరస్సులో 16.7 అడుగుల నీరుంది. ఇక పాకాలకు గోదావరి జలాల నిరంతర తరలింపుతోనే పంట చేతికందుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి భరోసా ఇస్తున్నా కార్యాచరణలో ఉన్న కొన్ని లోపాలతో అన్నదాతల్లో కొంత ఆందోళన నెలకొంది. అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులను కలిసి ఆయకట్టుకు నీటిపై మాట్లాడింది.

**ఇప్పటికే సగం పెట్టుబడి పెట్టాం**

**సారంగపాణి, రైతు, అశోక్‌నగర్**

ఆయకట్టు మొత్తం సాగుకు అనుమతిచ్చారు. ఇప్పటికే ఎకరాకు 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. ఇంకా 45 రోజులు నీరు అవసరం. సంగెం కాలువకు రెండు అడుగులు నీటిమట్టం తగ్గితే ప్రవాహం తగ్గి నీరు అందదు. గోదావరి జలాలను నిరంతం తరలించాలి. నీటిమట్టం తగ్గకుండా అధికారులు శ్రద్ధ చూపాలి. లేదంటే రైతులకు అధికారులే పరిహారం చెల్లించాలి

తూములకు షట్టర్లు లేక వృథాఅచ్యుతం, రైతు, అశోక్‌నగర్‌పాకాల తూములకు, కాలువల బుర్రలకు తలుపులు ఉంటే నీటి వృథా తగ్గేది. ప్రస్తుతం నీరు ఎక్కువగా పాకాల వాగులోకి పోతుంది. పొలానికి నీరు పెట్టుకొని బుర్రలు బంద్ చేసుకునే వెసులు బాటు లేదు. సాగుకు అనుమతిచ్చిన అధికారులకు నీరందించాల్సిన బాధ్యత కూడా ఉంది.గోదావరి జలాలొస్తాయంటేనే 13 ఎకరాలు నాటేశా

సాంబయ్య, రైతు ఖానాపురంపాకాలలోకి గోదావరి జలాలు వస్తాయన్న నమ్మకంతోనే 13 ఎకరాల్లో నాటేశా. సంగెం కాలువ కింద పరిస్థితి కాస్త ఇబ్బందిగానే ఉంది. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా ఎగువ రైతులు దిగువ వారికి సహకరించాలి. రోజు నీటిని మోటార్లతో పాకాలకు తరలించాల్సిందే. 48 రోజులపాటు నిరంతరం నీరురమేష్, డీఈఈ, పాకాలఎమ్మెల్యే పెద్ది చొరవతో రామప్ప నుంచి గోదావరి జలాలను 48 రోజులు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని తరలిస్తాం. పంట ఎండిపోకుండా చూస్తాం. రోజుకు 300 క్యూసెక్కులు వస్తుంటే 290 క్యూసెక్కుల నీరు పొలాలకు ప్రవహిస్తోంది. పురాతన కాలువలు కాబట్టి కొంత ఇబ్బంది ఉంది. కొన్ని కాలువల్లో నాచు పెరిగింది. తొలగించి నీరందిస్తాం. రైతులు నీటిని సంరక్షించుకోవాలి.

# ఖనిజ నిర్లక్ష్యం

మహబూబాబాద్ : సహజ వనరుల్లో ఒకటైన నల్లరాయి (బ్లాక్ గ్రానైట్) ఖనిజ నిల్వలు మహబూబాబాద్ జిల్లాలో అపారంగా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒంగోలు సమీపంలోని చీమకుర్తిలో 'గెలాక్సీ' రకం గ్రానైట్ లభిస్తుండగా 'బ్లాక్ గ్రానైట్' రకం లభ్యమయ్యేది కేవలం తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లాలోనే అంటే ఆశ్చర్యం కలగక మానదు. ఆ తర్వాత బ్లాక్‌గ్రానైట్ దేశంలో కర్ణాటక రాష్ట్రంలోనే లభిస్తుంది. జిల్లాలో ఉత్పత్తి అయ్యే గ్రానైట్ అత్యంత నాణ్యమైంది కావడంతో ఈ రాయికి ఇతర దేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. జిల్లాలోని కేసముద్రం, దోర్నకల్, నెల్లికుదురు, కురవి, గూడూరు, మరిపెడ, తొర్రూరు, గార్ల మండలాల్లో అపార నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదై ఉంది. దోర్నకల్, కురవి, మరిపెడ, గార్ల మండలాల్లో గ్రానైట్ నిల్వలు ఉన్నప్పటికీ వీటిని వెలికితీసే ప్రయత్నాలు జరగడంలేదు. జిల్లాలో ఖనిజ సంపదపై విధించే రాయల్టీ ద్వారా ఏటా రూ.17కోట్ల ఆదాయం సమకూరుతుండగా ఇందులో సింహభాగం గ్రానైట్ క్వారీల నుంచే వస్తోంది. గ్రానైట్ క్వారీలకు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా వందల మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుంది. అయితే జిల్లాకు ఉన్న ఖనిజసంపదను ఆధారంగా చేసుకొని పరిశ్రమల ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధాన ఖనిజ వనరు బ్లాక్‌గ్రానైట్...మహబూబాబాద్ జిల్లాకు సహజ సిద్ధంగా ఉన్న ఖనిజ నిల్వల్లో బ్లాక్ గ్రానైట్ అత్యధికంగా ఉండడం విశేషం. జిల్లాలో 27లక్షల ఘనపు మీటర్ల బ్లాక్ గ్రానైట్ నిల్వలు ఉన్నట్లు జియాలజిస్టులు పరిశోధనల అనంతరం ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారు. తర్వాతి స్థానంలో రాతిఖనిజం (స్టోన్ అండ్ మెటల్) 53లక్షల ఘనపు మీటర్ల నిల్వలు ఉండగా బైరటీస్ ఖనిజం 21.6లక్షల టన్నులు, డోలమైట్ అండ్ బైరటీస్ ఖనిజం 10లక్షల టన్నులు, కలర్ గ్రానైట్ ఖనిజం 30వేల ఘనపు మీటర్లు, క్వార్ట్జ్ ఖనిజం 22వేల టన్నులు, డోలమైట్ 20వేల టన్నుల నిల్వలు జిల్లాలో భూగర్భంలో నిల్వలు ఉన్నాయని ప్రభుత్వ రికార్డుల ప్రకారం అంచనా. ఖనిజ సంపదలో అత్యధికంగా ప్రథమస్థానంలో బ్లాక్ గ్రానైట్ నిల్వలు ఉండడం గమనార్హం. ఈ సమాచారం బ్లాక్ గ్రానైట్ క్వారీలకు, అనుబంధ పరిశ్రమలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తోంది. దీని ద్వారా ప్రభుత్వానికి ఖనిజాల ఎగుమతిపై ఆదాయం లభించడమేకాకుండా వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

అనుబంధ పరిశ్రమలను విస్మరించిన ప్రభుత్వం...అపార ఖనిజ నిల్వలను వెలికితీసి వాటికి అనుబంధ పరిశ్రమలను నెలకొల్పితే ఖనిజ పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందుతుంది. 30 ఏళ్లుగా ఇక్కడ గ్రానైట్ క్వారీల్లో ఉత్పత్తి జరుగుతుండగా వాటికి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయకుండా గత, ప్రస్తుత ప్రభుత్వాలు విస్మరిస్తూ వచ్చాయని ఆరోపణలున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయిన ముడి బ్లాక్ గ్రానైట్ రాయి ఏపీలోని కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవుల ద్వారా చైనా, బంగ్లాదేశ్, దక్షిణ ఆఫ్రికా, ఇరాన్ తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ ముడి గ్రానైట్‌ను ప్రాసెసింగ్ చేసేందుకు అనుబంధ పరిశ్రమలైన పాలిషింగ్ యూనిట్‌లు నెలకొల్పితే బహుళ ప్రయోజనాలు ఉంటాయి. తద్వారా గ్రానైట్ రాయి ఉత్పత్తి వ్యయం తగ్గడమేకాకుండా నేరుగా పాలిషింగ్ అయిన రాయినే ఉత్పత్తి చేయడం ద్వారా అధిక ఆదాయం సమకూరుతుంది. అంతకంటే ముఖ్యమైంది ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : శివ్వారపు శ్రీధర్, ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కేసముద్రం మహబూబాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా బ్లాక్ గ్రానైట్ నిల్వలు ఉండడంతో గత 30 ఏళ్లుగా ఇక్కడ క్వారీలు నడుస్తున్నాయి. కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న పరిశ్రమల అధిపతులు మైనింగ్, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. పాలకులు పట్టించుకోకపోవడం వల్లనే గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి చెందడంలేదు. అనుబంధ పరిశ్రమలను నెలకొల్పడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

# మైనింగ్ రాయల్టీ పెంపు

తాండూరు : రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడంలో భాగంగా ఖనిజాలపై భారీ ఎత్తున రాయల్టీని పెంచింది. ప్రతి మూడేళ్ల కోసారి రాయల్టీ పెంచాల్సి ఉండగా, ఈసారి మాత్రం ఆరేళ్ల తర్వాత రాయల్టీని పెంచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 ఖనిజాలపై రాయల్టీని పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. వికారాబాద్ జిల్లాలో ముఖ్యంగా నాపరాయి, సుద్ధ, ఎర్రమట్టి, కంకర ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో సున్నపురాయి టన్నుకు రూ.100రాయల్టీ ఉండగా, ప్రస్తుతం రూ.130కి పెంచారు. సుద్ధ టన్నుకు రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.195కు పెంచారు. ఎర్రమట్టి టన్నుకు రూ.100 ఉండగా, ప్రస్తుతం రూ.130కి పెంచారు. కంకర రూ.50 నుంచి రూ.65కి పెంచారు. పెంచిన రాయల్టీని తక్షణమే అమల్లోకి తీసుకొచ్చారు. జిల్లాలో నాపరాయి గనులు 80, సుద్ధ గనులు 36, ఎర్రమట్టి



గనులు 70, కంకర గనులు 30 వరకు ఉన్నాయి. ప్రతి ఏటా ఖనిజ సంపదపై రూ.80కోట్ల మేరకు ఆదాయం వస్తుంది. రాయల్టీ పెరగడంతో పాటు ఉత్పత్తులు పెరిగితే ఆదాయం రూ.100 కోట్ల వరకు చేరుకునే అవకాశం ఉంది. తాండూరులో ఉన్న మూడు సిమెంటు కర్మాగారాల ద్వారా రూ.30 కోట్ల మేరకు ఆదాయం వస్తుంది. అయితే సిమెంటు ఉత్పత్తికి వాడే లైమ్ స్టోన్ టన్నుకు రూ.80 ఉంది. అయితే లైమ్‌స్టోన్‌కు సంబంధించి రాయల్టీ మాత్రం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున దాని రాయల్టీని పెంచలేదు. జిల్లా నుంచి ఎర్రమట్టి కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రాకు తరలనుండగా, నాపరాయి కర్ణాటక, ఆంధ్రా, తమిళనాడు, మహారాష్ట్రకు వెళుతుంటాయి. ఈప్రాంత సుద్ధ మాత్రం విదేశాలకు ఎగుమతి అవుతుంది. అయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రంలో ఖనిజాలపై రాయల్టీలో భారీ తేడాలు ఉండటంతో తాండూరుకు సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం మిర్యాణం వైపు నాపరాయి వ్యాపారులు తమ వ్యాపారం విస్తరించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే తాండూరుకు చెందిన నాపరాయి వ్యాపారులు నాపరాయిపై రాయల్టీ తగ్గించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కలిసి ద్వారా విన్నవించారు.

# కనెక్షన్.. కలెక్షన్..

మహబూబాబాద్ :వ్యవసాయ భూముల్లో కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. డీడీలు చెల్లించినా విద్యుత్‌లైన్లు రావడం లేదు. సీనియారిటీ వారీగా కనెక్షన్లు మంజూరు చేయాల్సి ఉన్నా చేయి తడిపిన వారికి, పైరవీలతో వచ్చిన వారికే పెద్ద పీట వేస్తున్నారన్న విమర్శలు న్నాయి. విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేమి, కొందరు సిబ్బంది కాసుల కక్కుర్తి సమస్యలకు కారణమవుతోంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో రైతులు చిన్న చిన్న కమతాలను కూడా సాగులోకి తెచ్చి బోర్లు వేసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం చెరువులు, కుంటలను ఆధునీకరించడంతో నీటి లభ్యత పెరిగింది. ఇది వరకు కేవలం వర్షాధారం మీదనే పంటలు పండించగా ప్రస్తుతం నీటి వనరులు అందుబాటులోకి రావడంతో బోర్లు, చెరువుల ద్వారానూ పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ బోర్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఎక్కువగా ఉంది. అయితే మోటార్ల సంఖ్య పెరిగి లోడుకు తగ్గట్టు ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం కూడా పెరుగుతోంది. దీంతో విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎగబడుతున్నారు.

దరఖాస్తులు

ఎల్‌టీ లైను లాగి వ్యవసాయ పంపుసెట్టుకు కనెక్షన్ ఇవ్వాలన్నా, ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు పంపుసెట్టుకు కనెక్షన్ ఇవ్వాలన్నా రైతులు విద్యుత్ శాఖకు రూ.5,787 డీడీ కట్టాలి. పొలానికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం, అధార్‌కార్డులు జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌ఫొటోలతో మీ సేవా కేంద్రం లేదా విద్యుత్‌శాఖ సమీకృత వినియోగదారుల సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత లైన్‌మెన్‌తో కలిసి ఏఈ క్షేత్ర పరిశీలన చేసి, దరఖాస్తు చేసిన రైతు పొలానికి ఎన్ని స్తంభాలు అవసరం అవుతాయి. ఎన్ని మీటర్ల కండక్టర్ వైరు లాగాల్సి ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువచ్చేందుకు అవసరమయ్యే రవాణా ఖర్చు తదితర వివరాలతో అంచా వేసి విద్యుత్ శాఖకు రిపోర్టు సమర్పించాల్సి ఉ ంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన నెల రోజుల్లోపు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రాధాన్యతా క్రమం..2016 జనవరి నుంచి మొదట దరఖాస్తు చేసుకున్నవారికి మొదట అనే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ విధానం ప్రకారం మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి ముందు దరఖాస్తు చేసుకున్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. పౌరసేవల పట్టిక ప్రకారం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే జారీ చేయాలి. గ్రామాల వారీగా సీనియారిటీ జాబితాను రూపొందించి కార్యాలయం వద్ద ప్రదర్శించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమల్లో కనిపించడం లేదు. తేదీల వారీగా వచ్చిన వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించకుండా కాలాయాపన చేస్తున్నారు.

ముడుపులిస్తేనే..

కొత్త కనెక్షన్ల కోసం కార్యాలయాలకు వచ్చే రైతులు నుంచి కొందరు విద్యుత్ అధికారులు, సిబ్బంది మామూళ్లు దండుకుంటున్నారు. సిఫార్సులు, పైరవీలతో పాటు చేతులు తడిపినవారికే ముందస్తుగా కనెక్షన్లు ఇస్తున్నారు. లేకుంటే దరఖాస్తులను పక్కన పడేస్తున్నారు. రాజకీయ నేతలు సిఫార్సు చేసినవారికి ముందుగా ఇస్తున్నారు. సాధారణ రైతులు మాత్రం నెలలతరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఇంకా ఇతర మెటీరియల్ కావాలంటే కూడా రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. హెచ్‌వీడీఎస పథకం ద్వారా ఉచితంగా నెలకొల్పాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లకు సైతం రైతుల నుంచి కనెక్షన్లకు ఓ రేటు కట్టి ఒక్కో గ్రామంలో రూ.లక్షల్లో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి.

పెండింగ్‌లో దరఖాస్తులు ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మొత్తం 16 సర్కిళు ఉన్నాయి. వీటి నుంచి కొత్త వ్యవసాయ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో 20వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 7,500 వరకు మంజూరు లేక రెండేళ్లుగా మూలుగుతున్నాయి. వీటిలో జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.పారదర్శకంగా కనెక్షన్ల మంజూరు– గోపాల్‌రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీఎన్‌పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులు 20వేల వరకు ఉన్నాయి. అయితే ఇవన్నీ నాలుగైదు నెలల్లో అందినవే.. వీటిని కూడా వచ్చే మూడు నాలుగు నెలల్లో పరిష్కరిస్తాం. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీ పారదర్శకంగా జరుగుతోంది. నిబంధన మేరకు కొత్త వ్యవసాయ కనెక్షన్లు జారీ చేస్తున్నాం. ఎక్కడా పైరవీలకు తావు లేదు. క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బందులకు గురిచేసినట్టు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

# ‘గొరక’రాని కొయ్య



మహబూబాబాద్ : గొరక చేపలతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. నాటు చేపలకు చేటు చేస్తున్న గొరక చేపలతో ఆర్థికంగా నష్టపోతున్నారు. అసలే చేపల దిగుబడి అంతంత మాత్రం ఉన్న ఈ సమయంలో గొరక చేపలతో వేగలేకపోతున్నారు. దీంతో పెట్టుబడి రాక మత్స్యపారిశ్రామిక సొసైటీలు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నాయని మత్స్యకార్మికులు కన్నీంటి పర్యంతం అవుతున్నారు. నాటు చేపలకు చేటుగ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకారులు కోట్ల రూపాయలు పెట్టి చేప పిల్లలు (సీడ్) కొనుగోలు చేసి పోస్తున్నారు. అయితే ఈ చేపలను గొరక చేపలు మింగేస్తున్నాయి. చెరువుల్లో పోసిన చేపలకు ముళ్ల నాసు, లొట్టపీసు చెట్లు, ఇతర వ్యర్థ పదార్థాలతో ముప్పు ఉండగా, ఇప్పుడు గొరక చేపలతో అవి కరువు అయ్యే ప్రమాదం ఏర్పడిందని ముదిరాజ్ కులస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల ద్వారా వచ్చే నీటితో గొరక చేపలు చెరువుల్లోకి చేరుకుంటున్నాయని చెబుతున్నారు. ఈ చేపలు ఇతర చేపల గుడ్లు తినేసి వాటిని ఎదుగనివ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లల్లో నష్టం గొరక చేపలతో జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ సొసైటీలకు ఈ యేడు రూ.కోట్లల్లో నష్టం వాటిల్లింది. జిల్లాలోని 16 మండలాల్లో 163 సొసైటీలు ఉండగా, అందులో 136పారిశ్రామిక సహకార సొసైటీలు, 11 మహిళ పారిశ్రామిక సొసైటీలు, 15 గిరిజన మత్స్యపారిశ్రామిక సొసైటీలు చొప్పున మొత్తం 163 సంఘాలు ఉన్నాయి. వీటి ద్వారా జిల్లావ్యాప్తంగా మొత్తం 10,949 కుటుంబాలు వ్యాప్తం గా జీవనోపాధి పొందుతున్నారు. 1,148 చెరువులు, కుంటలు సొసైటీల కింద ఉన్నాయి. ప్రభుత్వం ఉచితంగా 4.24కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసింది. దీంట్లో 2.11కోట్లు 30ఎంఎం నుంచి 40ఎంఎం, 2.13కోట్ల చేప సీడ్స్, 80ఎంఎం నుంచి 100ఎంఎం సైజ్ కలిగిన పిల్లలు ప్రభుత్వం ముదిరాజ్ సొసైటీలకు సరఫరా చేసింది. ఇవి కాక సొసైటీల తరపున ప్రతీ చెరువు, కుంటకు ఒక్కొక్క సొసైటీ వారు రూ.లక్ష విలువైన చేప (సీడ్స్) పిల్లలను ప్రైవేట్ మార్కెట్లో కొనుగోలు చేసి చెర్లల్లో వదిలారు.

పట్టేటోళ్ల కూలి గిట్టల్లే... : ఓర వీరన్న, గుండెపూడి సొసైటీ అధ్యక్షుడు చెరువుల్లో చేపపిల్లలు పోసి కష్టపడి పెంచితే అసలు చేపలు బదులు గొరక చేపలు పడుతున్నాయి. ఇవి కొనేటోళ్లు లేక చెరువు కట్టల వద్ద క్వింటాళ్లకొద్దీ పారబోస్తున్నాం. గుండెపూడి పెద్ద చెరువులో రూ.2లక్షలు వెచ్చించి పోసిన చేపలను ఇవి మింగేశాయి. కచ్చు వలలతో చేపలు పట్టేటోళ్ల కూలి కూడా గిట్టడం లేదు.

మత్స్యకారులను ఆదుకోవాలి : సూరబోయిన ఉప్పలయ్య, మరిపెడ మండల ముదిరాజ్ సంఘ బాధ్యుడుఅప్పులు తెచ్చి లక్షలకు లక్షలు పెట్టుబడి చేపలు పెంచితే గొరక చేపల వల్ల తీవ్రంగా నష్టపోయాం. మత్స్యకార పారిశ్రామిక సం ఘాలను ప్రభుత్వం ఆదుకోవాలి. చెరువుల్లో ముళ్ల నాసు, లొట్టపీసు చెట్లను తొలగించి చేపల పెరుగుదల కు సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రతీ మత్స్యకార కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

జిల్లా వ్యాప్తంగా భారీగా నష్టం : గొడుగు శ్రీనివాస్, ముదిరాజ్ మహసభ రాష్ట్ర కార్యదర్శిగొరక చేపల వల్ల జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు పెద్ద ఎత్తున నష్టపోయారు. తొర్రూరు మండలం వెలికట్టె, కేసముద్రం మండలం ఇనుగుర్తి, చిన్నగూడూరు మండలం జయ్యారం, మరిపెడ మండలం ఎల్లంపేట, చిల్లంచర్ల, కురవి మండలం నేరడ, తట్టుపల్లి తదతర గ్రామాల మత్స్యకారులకు తీరని నష్టం జరిగింది. మత్స్య సంపద రక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

అరికట్టడం అసాధ్యం : నాగమణి, జిల్లా మత్స్యశాఖ సంక్షేమ అధికారిగొరక చేపలను అరికట్టడం అసాధ్యం. చెరువులోని నీరు మొత్తం ఇంకిన తర్వాతనే వీటిని వేరేయాలి. మత్స్యకారులే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి కట్టడికి జిల్లా మత్స్యశాఖ తగు సూచనలు, సలహాలు ఇస్తోంది.

# సర్వర్ డౌన్!

రంగారెడ్డి : పీఎం కిసాన్ యోజన పథకం డబ్బులు రావాలంటే ఆధార్ నెంబర్‌ను సంబం?ధిత ఫోన్ నెంబర్‌కు లింక్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు స్పష్టం చేయడంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఆధార్‌కార్డులు తీసుకొని ఇంటర్‌నెట్, సీఎస్సీ సెంటర్లు, ఆధార్‌కార్డు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. రెండు రోజులుగా పీఎం కిసాన్ వైబ్‌సైట్ సర్వర్ సమస్య వస్తుంది. దీంతో మండే ఎండలో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. ప్రభుత్వం ఉచితంగానే ఆధార్ నెంబర్‌ను లింక్ చేస్తున్నామని చెబుతున్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదు. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఆయా ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వహకులు ఒక్కకొక్కరి నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. ఆధార్ లింక్ చేసుకోవడానికి ఈనెల 31వ తేది చివరిరోజుగా ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కాగా పీఎం కిసాన్‌లో కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వకపోడంతో చాలామంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు కొత్తవారికి సైతం ఆప్షన్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇంటర్‌నెట్, సీఎస్సీ కేంద్రాల వైపు పరుగులు తీస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి ఉదయాన్నే మండల కేంద్రాలకు చేరుకుని సాయంత్రానికి తిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు. తెరుచుకోని ఆధార్ సెంటర్లుచేవెళ్ల డివిజన్ పరిధిలో ఉన్న 8 ఆధార్ నమోదు కేంద్రాలు వారం పదిరోజులుగా మూతపడ్డాయి. ఇందులో చేవెళ్లలో రెండు, శంకర్‌పల్లి మండలం శంకర్‌పల్లి, దొంతన్‌పల్లి, మోకిల, మొయినాబాద్ మండలంలో రెండు, షాబాద్ మండలంలో ఒకటిచొప్పున ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. వాటిల్లో పని చేస్తున్న సిస్టమ్ ఆపరేటర్లు ఆధార్‌కార్డు నమోదులో కొన్ని పొరపాట్లు చేయడంతో వారందరినీ సంబంధిత ఆధార్ కేంద్రాల నిర్వహణ అధికారి సస్పెండ్ చేశారు. దీంతో ఆధార్ కార్డు కేంద్రాలు మూతపడ్డాయి. అయితే చాలామంది వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఆధార్ కార్డు నమోదు కేంద్రాల వద్దకు వచ్చి మూసిఉన్న సెంటర్‌లను చూసి నిరాశగా తిరిగి వెళ్లిపోతున్నారు. ఆధార్ సెంటర్లు మూసి ఉండటంపై ప్రజలు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త ఆపరేటర్లను నియమించి వెంటనే ఆధార్ నమోదు కేంద్రాలు తిరిగి ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై చేవెళ్ల తహసీల్దార్ అశోక్‌మార్‌ను వివరణ కోరగా ఆధార్ కార్డు నమోదు కేంద్రం విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వివరించారు.

# ఒక్కచాన్స్ ప్లీజ్!

రంగారెడ్డి :ఎన్నికల వేడి మొదలైంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సీట్లకోసం పోటీ ఎక్కువైంది. ఈ పోటీ అధికార పార్టీలోనే కాదు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అయితే, ఈసారి చాలామంది సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం రాదన్న వార్తలతో వారు టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. అధిష్టానాన్ని బతిమిలాడుకునే పనిలో పడ్డారు.

రాష్ట్రంలో ముందస్తుగానే ఎన్నికల వేడి మొదలు కావడంతో ఆశావహులు ఇప్పటి నుంచే టిక్కెట్ల కోసం వేట మొదలు పెట్టారు. ప్రధాన రాజకీయపార్టీల నుంచి వలువురు పోటీకి సన్నద్ధమవుతున్నారు. అయితే టిక్కెట్ల విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ నేతలకు ముందస్తుగా హామీలు ఇవ్వడం లేదు. సిట్టింగ్‌ల పరిస్థితి కూడా దాదాపు అలానే ఉంది. సర్వేల్లో ప్రజాభిప్రాయం మేరకు సీట్లు కేటాయిస్తామని అధికార టీఆర్‌ఎసతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు కూడా చెబుతున్నాయి. ఈ మేరకు ఆయా పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు నిర్వహిస్తున్నాయి. అధికార టీఆర్‌ఎస్ పార్టీ ప్రశాంత్‌కిషోర్ టీమ్‌తో సర్వేలు మొదలు పెట్టింది. మరోవైపు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి కూడా సమాచారం సేకరిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై రోజువారీ నివేదికలు కూడా తెప్పించుకుంటున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా అదే దారిలో ఉంది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా సర్వేల ఆధారంగానే సీట్లు కేటాయిస్తామని, ఎంత సీనియర్లైనా ప్రజల్లో లేకుంటే టిక్కెట్ల ఇచ్చేది లేదనే విషయాన్ని స్పష్టం చేశారు. ఇక బీజేపీ నాయకత్వం కూడా ప్రజామోదం ఎక్కువగా ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తామని చెబుతోంది. దీంతో టిక్కెట్టు ఆశిస్తున్న ఆయా పార్టీల నేతల్లో టెన్షన్ మొదలైంది. తమకు ఒక్కసారి చాన్స్ ఇవ్వాలని అగ్రనేతల చుట్టూ తిరుగుతున్నారు. ఎమ్మెల్సీలు సైతం ఒక్కసారి ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరుతుండడం గమనార్హం. సిట్టింగ్ ఎమ్మెల్సీ, మాజీమంత్రి మహేందర్‌రెడ్డి తన కోరికను ఇప్పటికే అధిష్టానం వద్ద వ్యక్త పరిచారు. మరో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ఇదే ఆశతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్నిచోట్ల కూడా అధికార టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో మహేశ్వరం నుంచి కాంగ్రెస్ తరపున విజయం సాధించిన సబితారెడ్డి, తాండూరు నుంచి కాంగ్రెస్ తరుపున గెలుపొందిన రోహిత్‌రెడ్డిలు ఆ తరువాత టీఆర్‌ఎసలో చేరిన విషయం తెలిసిందే. దీంతో అన్ని స్థానాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇపుడు ఇందులో పనితీరు బాగాలేని కొందరిని టీఆర్‌ఎస్ అధినాయకత్వం పక్కన పెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు పార్టీ నాయకత్వం ఇప్పటికే సిట్టింగ్‌లకు సంకేతాలు పంపింది. ప్రజల్లో మంచి పేరున్న వారికే మరోసారి అవకాశం కల్పిస్తామని, ప్రజల్లో వ్యతిరేకత ఉన్న వారిని సాగనంపుతామని అంతర్గత సమావేశాల్లో పార్టీ అగ్రనేతలు ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. టీఆర్‌ఎసలో నేతలకు కొదవలేదు. ప్రతి నియోజకవర్గంలో కూడా టిక్కెట్ రేస్‌లో ముగ్గురు నలుగురున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వీరంతా ఏదో ఒక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గాల్లో చురుకుగా ఉంటున్నారు. దీంతో సిట్టింగ్‌ల్లో కలవరం మొదలైంది.

పర్యటనల్లో ఎమ్మెల్యేలు బిజీబిజీఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో రోజువారీ పర్యటనలు చేస్తున్నారు. కొందరైతే ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామాల్లో నిత్యం పర్యటిస్తున్నారు. టిక్కెట్ విషయంలో ఆందోళనతో ఉన్న సిట్టింగ్‌లు కొందరు ముఖ్యనేతలను కలిసినప్పుడు మరోసారి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. నగర శివార్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ అధికార పార్టీ ఎమ్మెల్యేకు ఈసారి టిక్కెట్ లభించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఈ విషయం తెలిసిన ఆయన మరొక్కసారి అవకాశం ఇవ్వండి.. తరువాత మళ్లీ టిక్కెట్ అడగనని ముఖ్యనేతలను కోరుతున్నట్లు సమాచారం. ఆయనే కాదు చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఇదే ఆందోళనతో ఉన్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలామందిపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో వారి స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. దీంతో పలుచోట్ల ద్వితీయశ్రేణి నేతలు, ఇప్పటివరకు పోటీ చేసేందుకు అవకాశం దక్కని నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు. అధినాయకత్వం దృష్టిలో పడేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలతో పాటు సామాజిక కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నారు. తమకు ఒక్కసారి అవకాశం కల్పించాలని ముఖ్యనేతలను కోరుతున్నారు. ఇందుకోసం సీనియర్ నేతలతో పైరవీలు కూడా చేయించుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. అనేకచోట్ల ఇద్దరు, ముగ్గురు టిక్కెట్ రేస్‌లో ఉన్నారు. ఒక్కసారి తమకు అవకాశం కల్పించాలని అగ్రనేతలను కలిసి విన్నవించుకుంటున్నారు. ఇటీవల కాలంలో నగర శివార్లలో పుంజుకున్న బీజేపీలో టిక్కెట్ల కోసం పోటీ పెరుగుతోంది. ముఖ్యంగా మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో పలువురు టిక్కెట్లు ఆశిస్తున్నారు. ఈ మూడు స్థానాల్లో టిక్కెట్ల కేటాయింపు పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారింది. ముఖ్యంగా మహేశ్వరంలో టిక్కెట్ కోసం పలువురు నేతలు గట్టిగా పోటీపడుతున్నారు. ఇటీవల అమిత్‌షా పర్యటనలో కూడా రూ. లక్షలు ఖర్చుచేసి పోటీపడి ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టారు. వారసులు సైతం..ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తలపడేందుకు ముఖ్యనేతల వారసులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో గతంలో అదృష్టాన్ని పరీక్షించుకుని ఓటమి చెందిన వారు కూడా ఉన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి, మంత్రి మల్లారెడ్డి తనయుడు మహేందర్‌రెడ్డి. అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ తనయుడు వీరేందర్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి (బంటి), షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పెద్దకుమారుడు రవీందర్‌యాదవ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి కుమారుడు రోహిత్‌రావు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తనయుడు మిథున్‌రెడ్డి, శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ కుమారుడు రవికుమార్ యాదవ్, జడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ అన్న కుమారుడు వీరేష్ తదితరులు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అవకాశం వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. వీరంతా తమకు ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపు కొందరు సీనియర్ నేతలు తమకు టిక్కెట్ ఇవ్వకుంటే తమ పిల్లలకైనా ఇవ్వాలని కోరుతున్నారు. వారసులతో తమ నియోజకవర్గాల్లో జోరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.





# ఇటువంటి మంచిపని ఒక్కటైనా చేశావా జగన్?!: లోకేష్

కర్నూలు: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. ఈరోజు ఆదోని నియోజకవర్గం తుంబళం క్రాస్ విడిది కేంద్రం నుంచి 80వ రోజు పాదయాత్ర ప్రారంభమైంది. అనంతరం మంత్రాలయం నియోజకవర్గంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించింది. పాదయాత్రలో భాగంగా వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాయసీమలో ఒక్కమంచి పని అయినా చేశావా జగన్ అంటూ ప్రశ్నించారు. కరువుసీమలో సాగు, తాగునీరు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడిన కష్టం అడుగడుగునా సాక్షాత్కరిస్తోందన్నారు. మంత్రాలయం నియోజకవర్గం గవిగట్టు శివార్లలో పులికనుమ బ్రాంచి కెనాల్ ఎడారిలో ఒయాసిస్సులా నీళ్లతో కళకళలాడుతూ కన్పించిందన్నారు. తుంగభద్ర ఎల్ఎల్ సి కెనాల్‌కు నీరు నిలిపివేసినప్పుడు ప్రత్యామ్నాయ సాగునీటి వనరుగా కోసిగి మండలం పులికనుమ వద్ద రూ. 261కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిచేశారని గుర్తుచేశారు. దీనిద్వారా 64 గ్రామాలకు తాగునీరు, 26 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారన్నారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాయలసీమ ప్రజల కళ్లలో ఆనందం చూసేలా ఒక్క పనైనా చేశావా జగన్మోహన్ రెడ్డీ అంటూ లోకేష్ విరుచుకుపడ్డారు.

# నేడు సీఎం జగన్ అనంతపురం జిల్లా పర్యటన.. షెడ్యూల్ ఇదే

అనంతపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న 'జగనన్న వసతి దీవెన' కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. బుధవారం ఉదయం8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.20 గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు సీఎం చేరుకుంటారు. 10.40 – 12.35 గంటల వరకు నార్పల క్రాస్‌రోడ్స్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగం, అనంతరం జగనన్న వసతి దీవెన కార్యక్రమం– లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

**సీఎం పర్యటనపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జిల్లా పర్యటనకు విస్తున్నారని కలెక్టర్ గౌతమి తెలిపారు. సీఎం పర్యటనపై కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు, లబ్ధిదారులను సమావేశానికి బస్సుల్లో తీసుకురావాలని సూచించారు. వాహనాలు నిలిపేందుకు ప్రజలకు, వీఐపీలకు వేరువేరుగా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలి గ్యాలరీ వద్ద తాగునీరు, మజ్జిగ, స్నాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

**వినతులు స్వీకరించాలి:** ముఖ్యమంత్రికి సమస్యలు తెలుపుకొనేందుకు వచ్చే ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్రకు సూచించారు.



ప్రజల నుంచి ముందస్తుగానే అర్జీలు స్వీకరించి డీఆర్‌ఓకు అందజేయాలని ఆదేశించారు.

**ఏర్పాట్ల పరిశీలన :** సీఎం పర్యటనకు సంబంధించి నార్పలలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస్‌రావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్ పరిశీలించారు. వీరి వెంట ఆర్‌అండ్‌బీ అధికారి ఓబుల్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

# చంద్రబాబు చీకటికి ప్రతినిధి.. వైయస్ జగన్ వెలుగులకు ప్రతినిధి

## వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



తాడేపల్లి: ప్రతిపక్ష నేత చంద్రబాబు చీకటికి ప్రతినిధి, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వెలుగులకు ప్రతినిధి అని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అభివర్ణించారు. చంద్రబాబుకు ఎన్నికల సమయంలోనే బీసీలు గుర్తొస్తారని, బీసీల తోకలు కత్తిరస్తానంటూ చంద్రబాబు అవహేళన చేశారని గుర్తు చేశారు. చంద్రబాబుకు బీసీలంటే చిన్న చూపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని నాయీబ్రాహ్మణ కృతజ్ఞతా సభలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. చంద్రబాబు హయాంలో జరిగిందంతా నీచ రాజకీయమేనని సజ్జల ధ్వజమెత్తారు. మీడియాని అడ్డం పెట్టుకుని కావాల్సిన రీతిలో వార్తలు రాయించుకునే తత్వం చంద్రబాబుదని మండిపడ్డారు. వైయస్ జగన్ ప్రభుత్వంలోనే బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేశామని చెప్పారు. చంద్రబాబు తాను చదువుకున్న స్కూల్‌నే పట్టించుకోలేదని విమర్శించారు. టీడ్కో ఇళ్లు కటించలేక పునాదుల దశలోనే చంద్రబాబు వదిలేశారని మండిపడ్డారు. వైయస్ జగన్ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తి చేశారని తెలిపారు. లోకేష్‌కు మాత్రం ఏం పీకుతున్నారనే మాట తప్ప మరేమీ చంద్రబాబు నేర్పలేదన్నారు. లోకేష్ నోరు తెరిస్తే ఆ పీకుడు భాషే మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు మీడియ బలం తప్ప మరేమీ లేదని తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు చట్ట సభలో అవకాశం దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు పార్టీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. 175కి 175 అసెంబ్లీ సీట్లు కొట్టడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు. సంక్షేమం అంటే ఉండాలో చేసి చూపించిన వ్యక్తి జగన్ అని సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. నాయీ బ్రాహ్మణులు కాలర్ ఎగిరేసి బతికేలా సీఎం జగన్ చేశారని సజ్జల పేర్కొన్నారు. అలాంటి వ్యక్తికి నాయీ బ్రాహ్మణులు అండగా నిలవాలని సూచించారు. నాయీ బ్రాహ్మణులకు ఇప్పటికే ఆలయాల పాలక మండళ్లలో అవకాశం కల్పించారని, చట్ట సభల్లో కూడా అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. త్వరలో ఎమ్మెల్సీ కూడా వచ్చి తీరుతుందన్నారు. టీడీపీ ప్రచార ఆర్భాటాలలో పడిపోకుండా వాస్తవాలేంటో గ్రహించాలని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను తెచ్చి అందరికీ న్యాయం చేశారని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తర్వాత వచ్చిన చంద్రబాబు ఆ పథకాలను నిర్వీర్యం చేశారు. మళ్ళీ వైయస్ జగన్ ప్రభుత్వం వచ్చాకనే ఆ పథకాలన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఎల్‌కేజీ నుంచి విదేశాల్లో చదువుకునే వరకు మన పిల్లలకు అన్నీ వసతులు కల్పిస్తున్నారు. ఏనాడూ చంద్రబాబు సొంతంగా అధికారంలోకి రాలేదు. 2014–19 మధ్య అవకాశం వచ్చినా ప్రజలకు ఏమీ చేయలేదు. అన్న క్యాంటీన్ల దగ్గర నుంచి మరుగుదొడ్ల వరకు అంతటా అవినీతి, అక్రమాలే. టిడ్కో ఇళ్లు కట్టించలేక పునాదుల దశలోనే చంద్రబాబు వదిలేశారు. జగన్ వచ్చాకే వాటిని పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నారు. మనం కట్టించిన ఇళ్ల దగ్గర సెల్ఫీలు తీసుకుని మనకే సవాల్ చేస్తున్నారు. వీటిని ఎల్లోమీడియాలో తెగ ప్రచారం చేసుకుంటోంది. లోకేష్‌కుఏం పీకుతున్నారనే మాట తప్ప మరేమీ నేర్పలేదేమో?. నోరు తెరిస్తే ఆ పీకుడు భాషే మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు మీడియా బలం తప్ప మరేమీలేదు.

**వంచనతోనే గెలవాలనుకునే వ్యక్తి చంద్రబాబు :** చంద్రబాబు చీకటికి ప్రతినిధి, జగన్ వెలుగులకు ప్రతినిధి. చంద్రబాబు ఒక దోపిడీ మందను తయారు చేసుకున్నారు. కళ్లు ఆర్పకుండా అబద్ధాలు చెప్పటం ఆయనకే సాధ్యం. నిజాలు చెప్తే చంద్రబాబు తల వెయ్యి ముక్కలు అవుతుందని వైయస్ఆర్ అంటూ ఉండేవారు. అది నిజమే అన్నట్టుగా ఆయన తీరు కనిపిస్తుంది. వంచనతోనే గెలవాలనుకునే వ్యక్తి చంద్రబాబు. నా వల్ల మేలు జరిగితేనే ఓటెయ్యమని అడిగే ధైర్యం వైయస్ జగన్‌ది.

**కుల వృత్తులకు అండగా సీఎం వైయస్ జగన్ ప్రభుత్వం :** బీసీలకు ఇప్పటికే అధికభాగం పదవులు ఇవ్వగలిగాం. నిజమైన అర్హత బీసీలకు కూడా ఉన్నందునే జగన్ అన్ని పదవులు ఇవ్వగలిగారు. జగన్ ఓట్ల కోసం చేయటం లేదు. అందరి ఆత్మగౌరవం పెరగాలని చూస్తారు. కులవృత్తులకు అండగా నిలవటం ప్రభుత్వం బాధ్యతగా చూస్తుంది. చేదోడు పథకం ద్వారా పదివేలు చొప్పున మూడేళ్లుగా అందిస్తున్నాం. పోటీతత్వం పెరుగుతున్నందున మనం కూడా అందుకు అనుగుణంగా వ్యవహరించాలి. చంద్రబాబు పార్టీని వచ్చే ఎన్నికలలో వంచనతోనే గెలవాలనుకునే వ్యక్తి చంద్రబాబు. లేకపోతే సామాన్యులు బతకలేరు. గత ఎన్నికలలోనే గట్టిగా దెబ్బ కొట్టినా మళ్ళీ వస్తున్నాడు. ఈసారి రాజకీయంగా అంతం చేయాలి. 175 కి 175 సీట్లు కొట్టటమే లక్ష్యంగా పని చేయాలని సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.





# రెజ్లర్ల ఆరోపణలు తీవ్రమైనవే..

దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలేదంటూ స్టార్ రెజ్లర్లు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. రెజ్లర్లు చేస్తున్న ఆరోపణలు తీవ్రమైనవే అని పేర్కొంది. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ దిల్లీ పోలీసులకు నోటీసు జారీ చేసింది. బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఏడుగురు మహిళా రెజ్లర్లు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రెజ్లర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పిటిషన్ వేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినా.. బ్రిజ్ భూషణ్‌పై పోలీసులు కేసు నమోదు చేయలేదని పిటిషన్‌దారులు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. దీనిపై శుక్రవారం (ఏప్రిల్ 28) విచారణ చేపడతామని తెలిపింది. అంతేగాక, ఈ కేసులో ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచేందుకు జ్యుడిషియల్ రికార్డుల నుంచి ఆ ఏడుగురు రెజ్లర్ల పేర్లను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ జరిపిన పర్యవేక్షక కమిటీ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ గత ఆదివారం నుంచి స్టార్ రెజ్లర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మళ్లీ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకునేంత వరకు తాము నిరసన విరమించబోమని కుస్తీయోధులు స్పష్టం చేశారు. మరోవైపు రెజ్లర్ల ఆందోళన నేపథ్యంలో మే 7వ తేదీన జరగాల్సిన రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలను క్రీడా మంత్రిత్వ శాఖ నిలిపివేసింది.

# మళ్ళీ మోడీయే ప్రధాని..!

## విపక్షంలో భారీ చీలిక



దేశంలో బీజేపీని ఎదుర్కోవాలంటే కలసికట్టుగానే అన్నది విపక్షాలకు ఇపుడు అర్ధమవుతున్న విషయం. ఓట్ల చీలిక కనుక సాగితే కచ్చితంగా మోడీ మూడవసారి దేశానికి ప్రధానిగా ప్రమాణం చేయడం ఖాయమని కూడా భయం విపక్షాలలో ఉన్నాయి. నిజంగా ఈ రకంగా విపక్షాలలో ఒక కొత్త ఆలోచన రావడం గొప్ప విషయమే. ఇది 2019లో రాలేదు. ఇపుడు వచ్చింది. దాంతో విపక్షాలను ఏ విధంగా ఏకత్రాటిమీద నడిపించాలి అన్న దాని మీదనే ఇపుడు హాట్ హాట్ డిస్కషన్ విపక్ష శిబిరంలో సాగుతోంది. బీహార్ నుంచి సీఈం జేడీయూ అధినేత అయిన నితీష్ కుమార్ ఇపుడు విపక్ష నేతలను వరసబెట్టి కలుస్తున్నారు. ఆయన ఈ నెల 12న ఢిల్లీకి వెళ్ళి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ని కలిశారు. విపక్షాల ఐక్యత గురించి కూడా చర్చించారు. ఆయనతో మాటల సందర్భంగా కేజ్రీవాల్ ఏమన్నారో తెలియదు కానీ లేటెస్ట్ గా మాత్రం ఆప్ జాతీయ కార్యదర్శి సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడుతూ ఆప్ దేశంలో వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఒక విధంగా ఆప్ విపక్ష కూటమిని షాక్ ఇచ్చేశారు. కేజ్రీవాల్ ని ప్రధాని అభ్యర్ధిగా ప్రకటిస్తారా అంటే ఆవిషయం ప్రజలు డిసైడ్ చేస్తారని చెప్పుకొచ్చారు. అంటే ఆప్ సోలో ఫైట్ కే రెడీ అన్న మాట. ఆప్ ఆ విధంగా ఒంటరిగా బరిలోకి దిగడం వల్ల గుజరాత్ లో కాంగ్రెస్ కి భారీ నష్టం ఏర్పడింది. అలాగే గోవాలో అధికారం లోకి రాలేకపోయింది. ఇపుడు ప్రతీ రాష్ట్రంలో ఆప్ పోటీకి దిగితే ఆ వ్యతిరేక ఓట్లు అన్నీ చీలి మరోసారి బీజేపీకి లాభం అన్నదే కాంగ్రెస్ సహా విపక్షాల వాదన. అయితే తాము విడిగా పోటీ చేయబట్టే ఈ రోజున జాతీయ హొదా సాధించామని చాలా రాష్ట్రాలలో ఉనికి చాటుకున్నామని కూడా ఆప్ చెబుతోంది. పైగా కాంగ్రెస్ ని ముందు పెట్టి తాము మద్దతు ఇవ్వడం ఆప్ కి ఇష్టం లేదు అంటున్నారు. అలా నితీష్ కుమార్ తొలి రాయబారం ఫెయిల్ అయింది. ఇక ఈ నెల 25న నితీష్ కుమార్ బెంగాల్ సీఎం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని కలవబోతున్నారు. ఆమెను కాంగ్రెస్ నాయకత్వాన విపక్షాల కూటమిలోకి ఆహ్వానించనున్నారు అయితే ఇటీవల బెంగాల్ లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు వెనక వామపక్షాలు బీజేపీ ఉన్నారని ఆరోపించిన మమత కాంగ్రెస్ తో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోమని చెబుతున్నారు. మమత సైతం కాంగ్రెస్ నాయకత్వం వద్దు అని అంటున్నారు. దాంతో మమతను ఒప్పించి కాంగ్రెస్ కూటమి వైపు రప్పించడం నితీష్ వల్ల అవుతుందా అన్నదే చర్చగా ఉంది. ఇక ఇప్పటికే మహారాష్ట్రలోని ఎన్సీపీ కూడా కూటమి వ్యతిరేక సంకేతాలు ఇస్తోంది. మోడీ చదువు ఎందుకు అంటూ ఆ మధ్య శరద్ పవార్ ప్రశ్నించి విపక్షాల గాలి తీసేశారు. అలాగే అదానీ దేశంలో పెట్టుబడులు పెడితే నష్టమేంటి అన్న పాయింట్ ని లేవదీశారు. ఇక కాంగ్రెస్ నాయకత్వాన విపక్ష కూటమిలో నికరంగా ఉండేవి తమిళనాడు నుంచి డీఎంకె అలాగే ఉద్ధవ్ థాక్రే శివసేన అంటున్నారు. బీయారెస్ ఈ కూటమిలోకి వస్తుందా అంటే తెలంగాణా ఎన్నికల తరువాతనే అంటున్నారు. నితీష్ కుమార్ ని వీరందరితో మాట్లాడమని కాంగ్రెస్ పురమాయించినట్లుగా తెలుస్తోంది. ఈ బిగ్ టాస్క్ ని పెట్టుకుని నితీష్ కుమార్ రాష్ట్రాలు పట్టి తిరుగుతున్నారు. దేశంలని 543 లోక్ సభ సీట్లలో బీజేపీకి వ్యతిరేకంగా విపక్షం నుంచి ఒక్కరే పోటీగా ఉండాలన్నది విపక్ష కూటమి నినాదంగా ఉంది. ఆ విధంగా ఏ పార్టీకి ఎక్కడ బలం ఉంటే అక్కడ పోటీ చేయాలని మిగిలిన చోట్ల ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వాలని కూటమి నేతలు ప్రతిపాదిస్తున్నారు. ఇది ఆప్ లాంటి పార్టీల జాతీయ హొదా ఎదుగుదలకు భంగకరం కాబట్టి వారు నో అనే చెబుతారు. బీయారెస్ కూడా జాతీయ పార్టీగా కావాలనుకుంటోంది. మమత కూడా అదే ఆశతో ఉన్నారు. మొత్తానికి చూస్తే విపక్ష కూటమి అంతా ఏకత్రాటి మీదకు రావడం జరగదని అంటున్నారు. చూడాలి మరి నితీష్ ప్రయత్నాలు ఎంతమేరకు ఫలిస్తాయో.



# 'రేయ్... బీ కేర్ ఫుల్'..

అనంతపురం: తాడిపత్రిలో డీఎస్పీ చెప్పిందే లా అండ్ ఆర్డర్ అని, మున్సిపాలిటీలోనూ డిఎస్పీ జోక్యం చేసుకుంటున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కౌన్సిలర్లపై 307 కేసులు పెడుతున్నారని, డీఎస్పీ ఎమ్మెల్యేకి తొత్తుగా ఉన్నారని, ఇద్దరు బాగా డబ్బులు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. లాలూచీతో మున్సిపాలిటీ గబ్బు పడుతోందన్నారు. ఎమ్మెల్యేకి 50 లీటర్ల డీజిల్ మున్సిపాలిటీ నుంచి వేస్తున్నారన్నారు. "హే డీఎస్పీ ఇంకోసారి ఇంట్లోకి వస్తే చేతుల్లో ఏది ఉంటే దాంతో కొడతా... నీది చాలా ఎక్కువ అయింది.. రేయ్ ఏం దాదాగిరీ చేస్తావురా నువ్వు... పోతావ్ రా.. రేయ్ బీ కేర్ ఫుల్.. ఇంట్లోకి వస్తావా.. ఇంకొకసారి గేటు దాటిరా అరేయ్... ప్రభాకర్ రెడ్డి అంటే ఏంటో చూపిస్తా.. నీకు పొజిషన్ ఉంది... ఆ పొజిషన్ మేరకు బిహేవ్ చేయి.. నీకేం సంబంధంరా మున్సిపాలిటీ గురించి" అంటూ వ్యాఖ్యానించారు. " డీఎస్పీ ఎక్కడకు వెళ్ళేది ఎక్కడకు పోయేది అంతా తనకు తెలుసునని.. కానీ పోలీసులను కించపరచదలుచుకోలేదని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు.

డీఎస్పీ చైతన్య కమలహాసన్...ఎంత డబ్బు సంపాదించారో దానిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి వాతావరణాన్ని నాశనం చేస్తున్నారని, ఎమ్మెల్యే డబ్బులు ఇస్తుంటే తీసుకుంటున్నారని.. తాడిపత్రిలో ప్రతి దానికి కారకుడు డీఎస్పీయేనని.. ఎస్ఐ, సీఐలను బూతులు తిడుతున్నారని జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు..

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదాయం లక్ష కోట్ల రూపాయలు అయితే ఉద్యోగులకే రూ. 90 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం దారుణమని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు.

మంగళవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడుతూ.. వాలంటీర్ల జీతాలతో పాటు ఏపీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం రూ.60 వేల కోట్లకు మించి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులందరూ నిర్లక్ష్యం వహించకుండా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమంలో పాలుపంచుకోవాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. ఉద్యమించకుంటే ప్రతి ఉద్యోగి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి




ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జీతాలు సరైన సమయానికి పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని బొప్పరాజు పిలుపిచ్చారు.

## అమితాబ్ తో రొమాన్స్.. ఆ హీరోయిన్ కి వార్నింగ్ ఇచ్చిన ఖుష్బూ..!

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ ఖుష్బూ గురించి అందరికీ తెలిసిందే. ఉన్నది ఉన్నట్టుగా ముక్కుసూటిగా మాట్లాడే ఖుష్బూ హీరోయిన్ గా అప్పటి ప్రేక్షకులను అలరించగా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. తమిళ్ సినిమాలే కాదు తెలుగులో కూడా ఆమె వరుస సినిమాలు చేస్తున్నారు. సినిమాలే కాదు జబర్దస్త్ షోలో పార్ట్ టైం జడ్జ్ గా ఉంటున్నారు. ప్రస్తుతం జబర్దస్త్ జడ్జిగా ఇంద్రజ కృష్ణ భగవాన్ ఉంటున్నారు. వీరిలో ఏ ఒక్కరు మిస్సైనా ఖుష్బూ అక్కడ ప్రత్యక్షమవుతుంది. లేటెస్ట్ గా గోపీచంద్ హీరోగా వస్తున్న రామబాణం సినిమాలో కీలక పాత్రలో నటించారు ఖుష్బూ. ఈ క్రమంలో లేటెస్ట్ గా ఓ స్పెషల్ చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె హీరోయిన్ టబుకి వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని చెప్పుకొచ్చారు ఖుష్బూ. అమితాబ్ అంటే



ఎంతో ఇష్టమని చెప్పిన ఖుష్బూ చినీకం సినిమాలో టబు అమితాబ్ తో కలిసి రొమాన్స్ చేయడం తట్టుకోలేకపోయానని అన్నారు. చిన్నప్పుడు అమితాబ్ తో కలిసి నటించాను పెద్దయ్యాక కుదరలేదు. అయితే తనకు రాని ఆ ఛాన్స్ టబు దక్కించుకున్నందుకు ఆమెకు ఫోన్ చేసి మరీ తిట్టిందట. అమితాబ్ తో రొమాన్స్ చేస్తే తాను చేయాలి నువ్వెందుకు చేశావ్.. ఆయనతో రొమాన్స్ చేసే హక్కు అర్హత తనకే ఉన్నాయని చెప్పిందట. అలా అమితాబ్ పై తనకు ఉన్న ఇష్టాన్ని వెల్లడించింది ఖుష్బూ. చిరంజీవి బాలకృష్ణతో కూడా కలిసి నటించే అవకాశం కూడా చూస్తున్న అంటూ చెప్పారు. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూడాలి అలాంటి ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నా అన్నారు ఖుష్బూ.. తెలుగులో ఎలాగు సినిమాలు చేస్తున్నా కాబట్టి త్వరలోనే అలాంటి ఛాన్స్ అందుకుంటానని నమ్మకం ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ తో అజ్ఞాతవాసి సినిమాలో నటించిన ఖుష్బూ ఆ సినిమా ఎందుకు ప్రేక్షకులకు నచ్చలేదో తనకు అర్థం కాలేదని అన్నారు. బహుశా పవన్ మదర్ గా తనని యాస్పెక్ట్ చేయలేదని అన్నారు. మా మధ్య మ్యూజిక్ మిస్ అయ్యి ఉండొచ్చని అన్నారు.

## ఓ మైగాడ్! జాన్వీ-ఖుషీలకు ఇంటి పోరు!

కపూర్ ఫ్యామిలీ నుంచి ఇప్పటికే జాన్వీ కపూర్ క్రేజీ హీరోయిన్ గా సత్తా చాటుతోంది. తొందర్లోనే జాన్వీకి ఇంటి పోరు ఎదురుకానుంది. తన సోదరి ఖుషీ కపూర్ తనకు పోటీ కానుంది. ఖుషీ డెబ్యూ మూవీకి ఇప్పటికే సన్నాహకాలు సాగుతున్నాయి. ఇంతలోనే కపూర్ ఫ్యామిలీ నుంచి మరో అందాల భామ తెరకు పరిచయమయ్యే అవకాశాలున్నాయని హింట్ అందింది. జాన్వీ- ఖుషీ సిస్టర్స్ కి స్టెప్ సిస్టర్ అన్షులా కపూర్ కథానాయికగా ఆరంగేట్రం చేసేందుకు ఛాన్సులు కనిపిస్తున్నాయని గుసగుస మొదలైంది. అయితే దీనిక కారణం లేకపోలేదు. అన్షుల అర్జున్ కపూర్ సోదరి అన్న సంగతి తెలిసిందే. బోనీ కపూర్ మొదటి భార్యకు పుట్టిన ఆడబిడ్డ. అయితే అన్షులా పూర్తిగా బొద్దుగా కనిపిస్తుంది. పైగా తను మీడియా జూమ్ లో పెద్దగా కనిపించేందుకు ఆసక్తిగా ఉండదు. అయితే తాజాగా అన్షుల షేర్ చేసిన ఫోటోషూట్ షాక్ కి గురి చేస్తోంది. తన రూపం అమాంతం మారిపోయింది. తాజా రూపం చూశాక.. కత్రినా కైఫ్ సైతం తనని పొగిడేయకుండా ఆగలేకపోయింది! అర్జున్ కపూర్ సోదరి



అన్షుల మారిన రూపం సడెన్ సర్ ప్రైజ్ ఇచ్చింది. తన సోదరుడిలాగే అన్షులా ఇటీవల తన ఫిట్ నెస్ కు ప్రాధాన్యతనిస్తోంది. ఆరోగ్యంపై అదనపు శ్రద్ధ తీసుకుంటోంది. కొన్ని నెలల క్రితం జిమ్ లో కసరత్తులు ప్రారంభించింది. ఆమె బరువు తగ్గడంపై చాలా ఎక్కువగా దృష్టి పెడుతోంది. దాని ఫలితం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల తన మునుపటి రూపానికి ఇప్పటి రూపానికి మార్పు ఏమిటో ఆవిష్కరించేలా శారీరక పరివర్తనకు సంబంధించిన చిత్రాన్ని పంచుకుంది. పోస్ట్ లో అన్షులా అద్దం ముందు ఉన్న ఫోటోను పంచుకుంది. సాధారణ టీ-షర్ట్ - ట్రాక్ ప్యాంట్ లో అద్భుతంగా కనిపిస్తోంది. ఆమె బరువు తగ్గడం కత్రినా కైఫ్ సహా అందరినీ ఆకట్టుకుంది. కత్రినా నిన్ను చూడు అని వ్యాఖ్యానించింది. లవ్ ఎమోజీలను కత్రిన షేర్ చేసింది. కత్రినా వ్యాఖ్యలకు అన్షులా రెడ్ హార్ట్ ఎమోజీల శ్రేణితో సమాధానం ఇచ్చింది. ఈ ఫోటోలు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచాయి. ఆమె సన్నిహితులు ఆమె బరువు తగ్గడంపై గగ్గోలు పెట్టేస్తున్నారు. తన ఫోటోని పంచుకుంటూ గాయకుడు కోల్బీ కైలట్ ట్రై పాటలోని సాహిత్యంతో పోస్ట్ కు శీర్షిక పెట్టారు. మొత్తానికి 120 కేజీలు పైగా బరువు ఉండే అర్జున్ కపూర్ తన వెయిట్ రిడక్షన్ కోసం ఎంతగా శ్రమించాడో తెలిసిందే. ఇప్పుడు తన సోదరి కూడా బరువు తగ్గేందుకు కఠినంగా శ్రమించిందని అర్థమవుతోంది. ఇంతకుముందు సారా అలీఖాన్ సైతం ఎంతో బొద్దుగా కనిపించేది. కానీ ఇప్పుడు రైజింగ్ హీరోయిన్ స్టాటస్ కి తగ్గట్టే ఎంతో స్లిమ్ గా ఉంది. అన్షులా తాజా మార్పు చూశాక ఇక జాన్వీ-ఖుషీలకు ఇంటిపోరు మొదలైనట్టేనని భావిస్తున్నారు.




## హిట్ సెంటిమెంట్ కోసం ఆమెను ఇరికించే ప్రయత్నం



బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ సుదీర్ఘ కాలం తర్వాత పఠాన్ చిత్రం తో ఒక భారీ బ్లాక్ బస్టర్ సక్సెస్ ను దక్కించుకున్నాడు. పఠాన్ సినిమా వెయ్యి కోట్లకు పైగా కలెక్షన్స్ రావడంతో షారుఖ్ ఖాన్ అభిమానులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు అంతా కూడా ఆయన తదుపరి సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. అట్లీ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ తదుపరి సినిమా జవాన్ రూపొందుతున్న విషయం తెల్సిందే.

జవాన్ సినిమా లో నయనతార కీలక పాత్రలో కనిపించబోతుంది. మరో ఇద్దరు ముద్దుగుమ్మలు కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. అయినా కూడా మరో హీరోయిన్ దీపికా పదుకునేను ఈ చిత్రంలో నటింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జవాన్ సినిమా లో దీపికా పదుకొనేను కనీసం ఒక్క పాటలో అయినా చూపించాలని షారుఖ్ ఖాన్ పట్టుబట్టినట్లుగా తెలుస్తోంది. దాంతో దర్శకుడు అట్లీ వీరిద్దరి కాంబోలో ఒక మాస్ బీట్ ఐటం సాంగ్ ను ప్లాన్ చేసినట్లుగా బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పఠాన్ సినిమాలో దీపికా పదుకొనే నటించడం వల్లే వెయ్యి కోట్లు వచ్చాయి అనే ఉద్దేశ్యంతో మేకర్స్ మళ్లీ ఆమెను జవాన్ లో కూడా నటింపజేసే ప్రయత్నం చేశారు. లక్కీ ఛామ్ అయిన దీపికా పదుకునే ను జవాన్ లో చూపిస్తే లక్ కలిసి వస్తుందని కొందరు నమ్ముతున్నారు.. కొందరు మాత్రం విడ్డూరంగా ఉందంటూ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. మొత్తానికి షారుఖ్ ఖాన్ జవాన్ సినిమా లో చివరి దశలో దీపికా పదుకొనే ను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. కేవలం సెంటిమెంట్ కోసం ఆమెను తీసుకు వచ్చేందుకు సిద్ధం అవ్వడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు పెదవి విరుస్తున్నారు.

## టైమ్ డిసైడ్ చేస్తే తల్లికి మళ్లీ పెళ్లి చేస్తుందట



సింగర్ సునీత ఇటీవల రెండో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె తరువాత చాలా మంది నీటీమణుల పేర్లు వార్తలో నిలిచారు. చాలా వరకు నెట్టంట వైరల్ అయ్యాయి. అందులో నటి సురేఖా వాణి పెళ్లి వార్త కూడా హాట్ టాపిక్ గా మారింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా వదినగా తల్లిగా నటిస్తూ తెలుగు తమిళ భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకుంది సురేఖా వాణి. ప్రస్తుతం పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా వున్న ఆమె తన కూతురు సుప్రీతతో కలిసి నెట్టింట వైరల్ వీడియోలతో సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ఓ పక్క సినిమాల్లో నటిస్తూనే కూతురితో కలిసి సోషల్ మీడియాలో సురేఖా వాణి చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. వరు పోస్ట్ లతో హల్ చల్ చేస్తున్న ఆమెపై ఇటీవల ఓ వార్త వైరల్ గా మారింది. మూడేళ్ల క్రితం సురేఖా వాణి భర్త చనిపోయాడు. అప్పటి నుంచి కూతురు సుప్రీతతో కలిసి వుంటోంది. చిట్టి పొట్టి డ్రెస్సుల్లో దర్శనమిస్తూ కూతురు సుప్రీతతో పోటీపడుతోంది.

ఇందుకు సంబంధించిన వీడియోలని సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్ గా మారుతున్నాయి. ఇదిలా వుంటే ఆమె త్వరలో మళ్లీ పెళ్లి చేసుకోబోతోందంటూ ఓ వార్త నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఈ పెళ్లి వార్తల్లో ఎలాంటి నిజంలేదని అవన్నీ వట్టి పుకార్లేనని సురేఖావాణి ఆమె కూతురు సుప్రీత కొట్టి పారేశారు. సురేఖా వాణి పెళ్లి గురించి సుప్రీత తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. పెళ్లి విషయంలో పూర్తి నిర్ణయం అమ్మదే. నాకైతే అమ్మకి పెళ్లిచేయాలని వుంది. ఖచ్చితంగా అమ్మ ఒప్పుకుంటే పెళ్లి చేస్తా. అయితే అది నా చేతుల్లో లేదు. టైమ్ డిసైడ్ చేస్తుంది. నాన్న చనిపోయి మూడేళ్లవుతోంది. ఇప్పుడిప్పుడే అమ్మ కుదురుకుంటోంది. అమ్మ తన కెరీర్ కంటే ఎక్కువగా నా కెరీర్ గురించే ఆలోచిస్తోంది అంటూ చెప్పుకొచ్చింది. అంతే కాకుండా తను ఏది చెబితే అది చేస్తానని అయితే తన ఇస్టాన్ని కూడా అమ్మ గౌరవిస్తుందని తెలిపింది. కెరీర్ పరంగా నాన్న ఇబ్బందిపడుతున్న సమయంలో అమ్మే మమ్మల్ని చూసుకుందని చిన్న చిన్న పాత్రల్లో నటిస్తూ ఫ్యామిలీని చూసుకుందని తెలిపింది. అయితే నాన్న చనిపోయిన సందర్భంలో మాత్రం అమ్మపై చాలా మంది దారుణంగా కామెంట్ లు చేశారని అవి విని అమ్మ ఎంతగా బాధపడిందో నాకు తెలుసని భావోద్వేగానికి లోనైంది.

అందుకే కామెంట్లని నేను పెద్దగా పట్టించుకోను చూడను.. అమ్మని కూడా చూడొద్దని చెబుతాను. నాన్న చనిపోయిన బాధని మర్చిపోవాలని పార్టీలకి వెళ్లినా కామెంట్ లు చేశారు. అమ్మ మళ్లీ పెళ్లి చేసుకోబోతోందంటూ దారుణంగా ట్రోల్ చేశారు. ఇలాంటి కామెంట్ వల్ల మేము ఎంత బాధపడ్డామో మాకు తెలుసు అని సుప్రీత చెప్పుకొచ్చింది. సుప్రీత ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన తాజా వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది.

## గ్లామర్ డోస్ బాగా పెంచిన అర్జున్ రెడ్డి బ్యూటీ

అర్జున్ రెడ్డి చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ షాలిని పాండే మొదటి సినిమా తోనే బ్లాక్ బస్టర్ సక్సెస్ ని దక్కించుకుంది. ఇలాంటి ప్రియురాలు కావాలని ప్రతి ఒక్క కుర్రాడు అనుకునే విధంగా ఆ సినిమాలో షాలిని పాండే నటించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా ఆకట్టుకున్నా కూడా అదృష్టం సరిగా లేక పోవడంతో ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. అర్జున్ రెడ్డి పాత్రలో నటించిన విజయ్ దేవరకొండ టాలీవుడ్ స్టార్ అవ్వగా.. ఆయన ప్రియురాలి పాత్రలో నటించిన షాలిని పాండే మాత్రం సక్సెస్ లు లేకపోవడంతో



కొన్ని సినిమాలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో చిన్నా చితకా సినిమాలు చేస్తున్న షాలిని పాండే మరో వైపు భారీ ఎత్తున సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అందరిని సర్ ప్రైజ్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందాల ఆరబోత ఫోటోలు షాకింగ్ గా ఉన్నాయి.

మిర్రర్ ముందు నిల్చుని క్లీ వేజ్ షో చేస్తూ అందాల విందు చేస్తూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో షాలిని పాండే అందాల ఆరబోత కామన్ అయ్యింది. తాజాగా ఈ ఫోటోలను చూస్తూ ఉంటే ఈ మధ్య కాలంలో అర్జున్ రెడ్డి బ్యూటీ అందాల ఆరబోత మరింత ఎక్కువ అయ్యిందనే టాక్ వినిపిస్తుంది.

## వివాదం తర్వాత పెళ్లికూతురు మెరుపులు!

ఏడాది కాలంగా నిరంతరం ఏదో ఒక కారణంతో వార్తల్లో నిలుస్తోంది ఫాతిమా సనా షేక్. ఇంతకుముందు అమీర్ ఖాన్ తన భార్య కిరణ్ రావు నుంచి విడిపోతున్నారన్న వార్తల అనంతరం ఓ ఊహించని ఫోటో నెట్ లో దుమారం రేపింది. అమీర్ ఖాన్-ఫాతిమా సనా షేక్ ల పెళ్లి ఫోటో ఇంటర్నెట్ లో హల్ చల్ చేసింది. ఇదే పెళ్లి ఫోటో అంటూ ఒక ఫోటోని వైరల్ చేసారు నెటిజనులు. గత ఏడాది జూలైలో విడాకులు తీసుకుంటున్నట్లు అమీర్ - కిరణ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాక పరిణామమిది. జూలై 2021లో అమీర్ ఖాన్ కిరణ్ రావు విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ జంట వారి 15 సంవత్సరాల వివాహాన్ని ముగించారు. దీంతో అమీర్ అభిమానులతో పాటు పరిశ్రమ జనం షాక్ కు గురయ్యారు. బ్రేకప్ ప్రకటన తర్వాత అమీర్ ఖాన్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారాడు. అతడిపై ఇంటర్నెట్ ట్రోల్స్ బెదిరింపులు ఎదురయ్యాయి. అమీర్ మాత్రమే కాదు... నటి ఫాతిమా సనా షేక్ కూడా నటుడితో పాత లింక్-అప్ పుకార్ల కారణంగా నెటిజనుల్లో టార్గెట్ గా మారింది. ఈ విషయంలో ఫాతిమా పేరును లాగారు. అమీర్ - కిరణ్ విడాకులకు ఆమె కారణమని ప్రజలు ఆమెను ఎగతాళి చేసారు .. నిందించారు.



ట్రోల్ లు మరొక స్థాయికి వెళ్లాయి. ఇద్దరూ రహస్యంగా వివాహం చేసుకున్నారనే వాదనలతో సోషల్ మీడియాలో వైరల్ అయిన అమీర్ - ఫాతిమా ఫోటోని షేర్ చేశారు. ఫోటోలో అమీర్ తెల్లటి సాంప్రదాయ సూట్ లో అలంకరించబడి ఉన్న ఫాతిమాతో పోజులిచ్చాడు. ఆమె హెయిర్ లైన్ లో సింధూర్ తో బంగారు కంజీవరం చీరలో పోజులిచ్చింది. అయితే పుకార్లు అన్ని నిరాధారమైనవి. ఫోటో కూడా ఫోటోషాప్ చేసినది అని తేలింది. వైరల్ అయిన ఫేక్ పిక్చర్ గురించి నిజం ఏమిటన్నది ఆరాలు మొదలయ్యాయి. చాలామంది నిజమేంటో తెలుసుకోకుండా చాలా మంది అమీర్ ను విమర్శించారు. తదుపరి అతని చిత్రం లాల్ సింగ్ చద్దాను కూడా బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం ఈ పుకార్లపై ఫాతిమా సనా షేక్ స్పందించింది. దంగల్ విడుదల తర్వాత కొన్ని సంవత్సరాల పాటు నటి ఫాతిమా సనా షేక్ అమీర్ ఖాన్ తో లింకప్ వార్తల్లో నలిగిపోయింది. తన డేటింగ్ పుకార్ల గురించి మాట్లాడుతూ.. ఆమె ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పింది. నేను ఎప్పుడూ కలవని కొంతమంది అపరిచితులు నా గురించి రాస్తున్నారు. అందులో నిజం ఉందో లేదో కూడా వారికి తెలియదు. దాన్ని చదివేవాళ్లు నేను మంచి వ్యక్తిని కాదని అనుకుంటారు. మీరు ఆ వ్యక్తిని అడగండి. నేను మీకు సమాధానం ఇస్తాను. ప్రజలు తప్పుగా భావించడం నాకు ఇష్టం లేనందున ఇది నన్ను కలవరపెడుతోంది అని వ్యాఖ్యానించింది. అమీర్ ఖాన్ - కిరణ్ రావు వారి కుమారుడు ఆజాద్ రావ్ ఖాన్ కు సహ-తల్లిదండ్రులుగా ఉన్నారు. నటుడు రీనా దత్తాను గతంలో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు - కుమారుడు జునైద్ ఖాన్ - కుమార్తె ఇరా ఖాన్ ఉన్నారు.



# తెలంగాణ పసుపు మయం..

## నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా మినీ మహానాడులు

హైదరాబాద్ : తెలంగాణలో పార్టీని గాడిలో పెట్టడంతోపాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పార్టీగా దూకుడు పెంచేందుకు టీడీపీ అధినేత చంద్ర బాబు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం అవుతున్నాయి. ఇప్పటికే బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్కు తెలంగాణటీడీపీ పగ్గాలు అందించారు. తరచుగా ఇక్కడ నేతలతో భేటీ అవుతున్నారు. ఇటీవల ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కూడా ఇచ్చారు. ఇలా.. పార్టీని అన్ని రూపాల్లోనూ ముందుకు తీసుకువెళ్లాలని చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మినీ మహానాడులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

హైదరాబాద్ రంగారెడ్డి నిజామాబాద్ వరంగల్ ఖమ్మం ఆదిలాబాద్ వంటి పార్టీకి గట్టి పట్టున్న జిల్లాల్లో మినీ మహానాడుల మోత మోగాలన్నారు. దీంతో పార్టీ తరపున కార్యక్రమాలు చేసేందుకు నాయకులు రెడీ అవుతున్నారు. పలితంగా రాష్ట్ర వ్యాప్తంగా పసుపు జెండాల రెపరెపలు కనిపించనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో 17 మినీ మహానాడులు నిర్వహించాలని నిర్ణయించారు. దివంగత విశ్వవిఖ్యాతన నటసార్వభౌముడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఈ మినీ మహానాడులు నిర్వహించనున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి మినీ మహానాడు కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. అవి మే నెల 20వ తేదీలోపు పూర్తిచేయాలని తెలంగాణ టీడీపీ నిర్ణయించింది. దీనికి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని తెలిసిందిఏ. 26న మహబూబ్నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్నగర్ హైదరాబాద్ పార్లమెంట్ సమావేశం కార్వాన్ సికింద్రాబాద్ పార్లమెంట్ మీటింగ్ ఖైరతాబాద్ చేవెళ్ల పార్లమెంట్ పరిగి మల్కాజ్గిరి పార్లమెంట్ కుత్బుల్లాపూర్ మెదక్ పార్లమెంట్ నర్సాపూర్ ఖమ్మం పార్లమెంట్ సత్తుపల్లిలో సమావేశాలు నిర్వహించాలని టీటీడీపీ నిర్ణయించింది.

కాగా మే 20 లోపు తెలంగాణలో మినీ మహానాడు సమావేశాలను పూర్తి చేయాలని పార్టీ నిర్ణయించింది. తర్వాత మే 28 29 తేదీల్లో రాజమండ్రిలో మహానాడు నిర్వహించనున్నారని సమాచారం.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ.. ఊరూరా గులాబీ జెండా రెపరెపలు





హైదరాబాద్: ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికార బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా మినీ ప్లీనరీలు నిర్వహిస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ ప్రతినిధుల సభలను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరాల్లో వాడవాడనా బీఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దీంతో ఊరూరా గులాబీ జెండా రెపరెపలాడుతున్నది. జై తెలంగాణ, జై భారత్, జై కేసీఆర్ నినాదాలతో పట్టణాలు, పల్లెలు అని తేడాలేకుండా మారుమోగుతున్నాయి. ఊరూరా పార్టీ జెండాలను ఆవిష్కరించిన తర్వాత పార్టీ కార్యకర్తలు, నాయకులు నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేసే ప్రతినిధుల సభకు చేరుకుంటున్నారు. ప్రతి సభలో మూడు వేల నుంచి 3,500 మంది కార్యకర్తలు, పార్టీ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఎన్నికల దిశగా ఎలా కార్యోన్ముఖులను చేయాలి? స్వరాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ సాధించిన విజయ పరంపర, రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసం తదితర అంశాలపై తీర్మానాలు చేయనున్నది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే సంజయ్, జడ్పీ ఛైర్పర్సన్ వసంత తదితరులు పాల్గొన్నారు.

ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రేగ కాంతారావు పార్టీ జెండా ఎగురవేశారు. కేసీఆర్ నాయకత్వంతోనే సువర్ణ ఆంధ్రప్రదేశ్ సాకారం: మంత్రి జగదీశ్ రెడ్డి సీఎం కేసీఆర్ నాయకత్వంతోనే సువర్ణ ఆంధ్రప్రదేశ్ సాకారమవుతుందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రాయల తెలంగాణ అంశం వదిలి ఆంధ్ర ప్రజలు ఆ దిశగా ఆలోచించాలని సూచించారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తప్పా?



హైదరాబాద్ : ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తప్పా?.. ప్రశ్నించే గొంతుకను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని వైఎస్ విజయలక్ష్మి అన్నారు. నేడు వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలతో ములాఖాత్ తర్వాత చంచల్ గూడ జైలు వద్ద విజయలక్ష్మి మాట్లాడుతూ.. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం అడుకుంటోందన్నారు. ఈరోజు జైల్లో పెట్టి గొంతు నొక్కేయవచ్చు కానీ షర్మిల మీ మధ్యకి వచ్చి మళ్ళీ పోరాడుతుందని విజయలక్ష్మి అన్నారు. ఇలాంటి నిర్బంధాలకు షర్మిల భయపడదని... బెయిల్ వస్తుందని ఆశిస్తున్నానన్నారు. షర్మిల ఏమైనా ఉద్యమకారిణా? టెర్రరిస్టా? అని ప్రశ్నించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. విద్యార్థులు సంయమనం పాటించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్ళ మీటింగ్స్ కి పర్మిషన్ ఇస్తున్నారని... షర్మిలకి ఎందుకు పర్మిషన్ ఇవ్వడం లేదని విజయలక్ష్మి ప్రశ్నించారు.

## 'తాను ఓబీసీ అని మోదీ స్వయంగా ప్రకటించుకున్నారు.. అయినప్పటికీ'



హైదరాబాద్: టీపీసీసీ బీసీ నాయకుల సమావేశం ఇందిరాభవన్‌లో ప్రారంభమైంది. మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. బీసీ కులాల జనగణన జరపాలని, బీసీ రిజర్వేషన్లు పెంచాలని రాహుల్ గాంధీ మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయ్యాక స్వయంగా తాను ఓబీసీ అని ప్రకటించుకున్నారని.. దీంతో బీసీలకు న్యాయం జరుగుతుందని భావించామన్నారు. కానీ మోదీ బీసీలకు ఏమీ చేయలేదని విమర్శించారు. బీసీల కులగణన జరిపితే జనాభా సంఖ్య పరంగా రిజర్వేషన్లు పెరిగి న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే బీసీ కులగణనపై ప్రధానికి లేఖ రాశారన్నారు. బీసీలకు మద్దతుగా నలిచిన మల్లికార్జున్ ఖర్గేకు, రాహుల్ గాంధీకి వీహెచ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ టీపీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్, ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీష్, లక్ష్మణ్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు రాజ్ ఠాకూర్, నగేష్ ముదిరాజ్, నూతి శ్రీకాంత్, సునీతా రావ్, మెట్టు సాయి కుమార్, శంబుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నాయకత్వంతోనే సువర్ణ ఆంధ్రప్రదేశ సాకారం: మంత్రి జగదీశ రెడ్డి



హైదరాబాద్: సీఎం కేసీఆర్ నాయకత్వంతోనే సువర్ణ ఆంధ్రప్రదేశ్ సాకారమవుతుందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రాయల తెలంగాణ అంశం వదిలి ఆంధ్ర ప్రజలు ఆ దిశగా ఆలోచించాలని సూచించారు. అక్కడి ప్రభుత్వాల వైఫల్యాలతోనే రాయల తెలంగాణ అంశం తెరమీదకు వచ్చిందన్నారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ జెండా పండుగా సందర్భంగా గులాబీ జెండాను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాయల తెలంగాణ అంశంపై స్పందిస్తూ.. ప్రత్యేక రాయలసీమ, రాయల తెలంగాణ ఇప్పుడు సాధ్యం కాదన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా దూసుకుపోవడమే రాయల తెలంగాణ డిమాండ్‌కు కారణమని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న పథకాలను చూసి.. చుట్టుపక్కల రాష్ట్రాల ప్రజలు తమను తెలంగాణలో కలపాలని కోరుతున్నారని తెలిపారు. ఇది కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణలో కలపండి లేకపోతే మా దగ్గరికి రండి అని కేసీఆర్‌ని ఆహ్వానిస్తున్నారని వెల్లడించారు. తెలంగాణ బంగారు తెలంగాణ మారినట్లుగానే.. సువర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమేనని గతంలోనే చెప్పారని గుర్తుచేశారు. పాలకుల చిత్తశుద్ధి లోపంతో ఇలాంటి డిమాండ్లు వస్తున్నాయన్నారు. పరిపాలకులను మార్చండి సువర్ణాంధ్రగా మార్చుకోవాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వాన్ని ఆంధ్ర ప్రజలు బలంగా కోరుకుంటున్నారని, వెనుకబాటుకు కారణమైన పారిపాలకుల మీద ఆంధ్ర ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. అభివృద్ధి సాధించే నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా ఆంధ్ర ప్రజలు, నాయకులు ఆలోచించాలని సూంచించారు.




జైపూరు: మంచిర్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో వేధిస్తున్నాడంటూ ఓ యువకుడిని యువతి కుటుంబసభ్యులు బండరాళ్లతో కొట్టి హతమార్చారు. జైపూరు మండలం ఇందారంలో అందరూ చూస్తుండగానే చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందారం గ్రామానికి చెందిన ఓ యువతితో ఎం. మహేశ్(24) అనే యువకుడు ప్రేమ వ్యవహారం సాగించాడు. గతేడాది యువతి తల్లిదండ్రులు సీసీ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో ఆమెకు వివాహం జరిపించారు. దీంతో యువతిపై కక్ష పెంచుకున్న మహేశ్.. ఆమెతో సన్నిహితంగా ఉన్న వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు యువకుడిపై జైపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆరునెలల క్రితం యువతి భర్త విడాకులు ఇచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో యువతి తన పుట్టింటికి వచ్చింది. అయినా పలుమార్లు యువతిని మహేశ్ వేధిస్తూ వచ్చాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేధింపులు కొనసాగుతుండటంతో మంగళవారం ఉదయం మహేశ్‌పై కత్తి, బండరాళ్లతో యువతి కుటుంబసభ్యులు దాడి చేసి హతమార్చారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ నరేందర్, ఎస్సై రామకృష్ణ పరిశీలించారు. నిందితులు పరారీలో ఉన్నారు.

## డిగ్రీ చేస్తూనే నెలకు రూ.10వేలు.. కేసీఆర్ సర్కారు సరికొత్త ప్లానింగ్



తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముంగిట్లోకి వచ్చేసిన వేళలో.. కేసీఆర్ సర్కారు కీలక నిర్ణయం ఒకటి తీసుకుంది. అయితే ఈ నిర్ణయాన్నినేరుగా కాకుండా విద్యా శాఖకు చెందిన ప్రముఖుడి చేత ప్రకటన చేయించటం ద్వారా కొత్త తరహా ఎత్తుగడకు తెర తీశారంటున్నారు. అగ్రరాజ్యమైన అమెరికాలో ఏ రీతిలో అయితే చదువుతూనే సంపాదించుకునే సౌకర్యం ఉంటుందో.. అదే తరహాలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరినంతనే నెలకు రూ.10వేల వరకు సంపాదించుకునే అవకాశాన్ని కల్పించేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ కొత్త పద్ధతిని త్వరలో ప్రారంభమయ్యే కొత్త విద్యా సంవత్సరం నుంచి షురూ చేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కాలేజీల్లో కాకుండా 103 కాలేజీల్లో ప్రారంభిస్తారు. అది కూడా అన్నీ కోర్సుల్లో కాకుండా ఎంపిక చేసిన కొన్ని కోర్సుల్లో చేపట్టి ప్రయోగాత్మకంగా పరిశీలించాలని భావిస్తున్నారు. దీని ఫలితాల ఆధారంగా మరింత మందికి అమలు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ కొత్త విధానంలో భాగంగా ఎంపిక చేసిన కోర్సులకు చెందిన విద్యార్థులు వారంలో మూడు రోజులు కాలేజీలో పాఠాలు వినాల్సి ఉంటుందని మరో మూడు రోజులు పని చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. డిగ్రీకి సంబంధించిన అన్ని కోర్సుల్లో కాకుండా పది కోర్సుల్ని ఎంపిక చేశారు.

- బీబీఏ (రిటైలింగ్) - బీబీఎస్ (ఈ-కామర్స్) - బీబీఏ (లాజిస్టిక్స్)
- బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) - బీఏ (కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్) - బీకాం (ఈ-కామర్స్) - బీకాం (హాస్పిటల్ మేనేజ్‌మెంట్) తదితర కోర్సులు

ఈ కొత్త విధానాన్ని ఒక్కో కాలేజీలో ఒకట్రెండు కోర్సులకు మాత్రమే ఈ విధానాన్ని అమలు చేసి ఫలితాల్ని మదింపు చేస్తారు. దీని ఆధారంగా చేసుకొని విద్యార్థులు ఒకపక్క థియరీ నాలెడ్జ్ తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ ను తెలుసుకునే వీలు కలుగుతుంది. అదే సమయంలో పేద విద్యార్థులకు ఆర్థిక భారంగా ఉండకుండా తల్లిదండ్రులకు మరింత దన్నుగా నిలిచే వీలుందంటున్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ దొందు దొందే



ఖమ్మం : కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి మతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. నేడు జరిగిన బీఆర్ఎస్ సభలో అయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా పరిపాలన చేస్తోందన్నారు. కేంద్రం తెలంగాణకు అన్యాయం చేస్తోందన్నారు. బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ దొందు దొందేనన్నారు. పార్లమెంట్‌లో ఏనాడైనా తెలంగాణ కోసం ఈ నేతలు మాట్లాడారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎటువంటి అభివృద్ధి చేస్తున్నారో చెప్పగలరా? అని నిలదీశారు. తెలంగాణ దేశానికే రోల్ మోడల్ అని... తెలంగాణ అభివృద్ధి చూసి పక్కరాష్ట్రాల ప్రజలు అక్కడి నేతలను నిలదీస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలంతా ఐక్యంగా పనిచేసి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు గెలుపొందాలని నామా పేర్కొన్నారు.

## తెలంగాణలో బీజేపీ ఎన్నికల ట్యాగ్ లైన్ ఇదే..




హైదరాబాద్: ఈసారి తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ.. అందుకు తగ్గట్టే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. 'తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం' ట్యాగ్ లైన్‌తో ముందుకు వెళ్తోంది. దీనిలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా గోడలపై కమలం పువ్వు గుర్తు, ఎన్నికల ట్యాగ్ లైన్‌తో రాతలు రాయిస్తోంది. ప్రతీ పోలింగ్ బైత్ పరిధిలో కనీసం 5 చోట్ల వాల్ రైటింగ్ కార్యక్రమం చేపట్టింది బీజేపీ. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ఫార్మాట్‌లో వాల్ రైటింగ్ చేయాలని పార్టీ ఆదేశించింది.

ఈ మేరకు పలు చోట్ల గోడలపై రాతలు రాయించే కార్యక్రమం చేపట్టారు స్థానిక బీజేపీ నేతలు. గోడలపై కమలం.. ప్రభుత్వం మాదేనని నినాదంతో బీజేపీ ముందుకు వెళ్లడం తెలంగాణలో పొలిటికల్ హీట్‌ను మరింత పెంచింది. ఇంకా ఎన్నికలకు సుమారు 8 నెలలు కాల వ్యవధి ఉండగా పొలిటికల్ పార్టీలు ఇప్పటికే తమ తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నాయి.

## చంచల్‌గూడ జైలు నుంచి షర్మిలకు విముక్తి.. బెయిలొచ్చింది కానీ..




హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలకు బెయిల్ మంజూరైంది. నాంపల్లి కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.30 వేలు, ఇద్దరి పూచీకత్తుతో షర్మిలకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తప్పనిసరి అని కోర్టు స్పష్టం చేసింది. పోలీసులపై దాడి కేసులో షర్మిల సోమవారం నాడు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. నాంపల్లి కోర్టులో ఇరు పక్షాల వాదనలు నడిచాయి.

షర్మిలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. షర్మిలపై నమోదు చేసిన సెక్షన్లన్నీ 6 నెలలు, మూడేళ్లలోపు జైలు శిక్ష పడేవేనని షర్మిల లాయర్ చెప్పారు. హైకోర్టు నిబంధనలను పోలీసులు పట్టించుకోవట్లేదని షర్మిల లాయర్ వాదించారు. పోలీసు విధులకు షర్మిల ఆటంకం కలిగించారని పోలీస్ తరపు లాయర్ వాదించారు. షర్మిలపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని, షర్మిలకు బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు విన్నవించారు. ఈ కేసులో ఇంకా సాక్షులను ప్రశ్నించాల్సి ఉందని పోలీసులు నాంపల్లి కోర్టుకు వెల్లడించారు.

ఇరు పక్షాల వాదనలు విన్న నాంపల్లి కోర్టు షర్మిలకు బెయిల్ ఇచ్చేందుకే మొగ్గు చూపడం గమనార్హం.

## నిర్మల్‌లో వేడుకగా గులాబీ జెండా పండుగ.. బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ నియోజకవర్గంలో ఊరూవాడల గులాబీ జెండా పండుగను వేడుకగా జరుపుకున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా పండుగా వాతావరణంలో బీఆర్ఎస్ జెండా వేడుకను నిర్వచించారు. నిర్మల్ పట్టణంలో పలు వార్డుల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. బుల్లెట్ బండి నడుపుతూ పట్టణమంతా కలియతిరిగారు. అంతకుముందు శాస్త్రి నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో గులాబీ జెండాను ఆవిష్కరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com